అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
ఆదివారం 27 ఆగస్టు 2023

కార్యకర్త కుటుంబానికి జనసేన అండ



కాగజ్‌నగర్ రూరల్ : జనసేన కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర ఇంచార్జి నేమూరి శంకర్‌గౌడ్ తెలిపారు. నిర్మల్ జిల్లాకు చెందిన నవీన్ నాయక్ ఇటీవల ప్రమాదవశాత్తు మరణించగా పార్టీ తరఫున రూ.5లక్షల చెక్కును బాధిత కుటుంబానికి హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా నేమూరి శంకర్‌గౌడ్ మాట్లాడుతూ పార్టీ క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు పార్టీ అధినేత బీమా కల్పించారన్నారు. కార్యకర్తలు పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమస్యలపై అధ్యయనం చేసి పరిష్కారం దిశగా ప్రణాళికలు రూపొందించి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ నియోజకవర్గ ఇంచార్జి అల్లూరి సాయికుమార్, అడ్వకేట్ నిరంజన్ చౌదరి, పెరుగు మనిష్, నెండుగూరి మధు, సంతోష్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-కుభీర్

అంగన్వాడీ టీచర్లు, ఆయాల రిటైర్మెంట్ వయస్సు 65 ఏండ్లకు పెంచడంతో శనివారం మండలానికి చెందిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సీఎం కేసీఆర్‌తో పాటు తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఉద్యోగ విరమణ వయస్సు 65 ఏండ్లకు పెంచడంతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్ కింద టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ.50వేలు ఆర్థికసాయం అందించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ మండల అధ్యక్షురాలు అనసూయ, అరుణ, సత్యశీల, గంగామణి, జ్యోతి పాల్గొన్నారు.

అసమ్మతి సర్దుకునేనా..?

- టికెట్ ఆశించి దక్కనివారిలో తీవ్ర అసంతృప్తి
- సిట్టింగ్ ఎమ్మెల్యేలకు సహకారంపై అనుమానాలు
- రెబెల్స్‌గా బరిలో నిలించేందుకు పలువురు సమాయత్తం
- సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఎదురుకానున్న అసమ్మతి బెడద
- బీఆర్ఎస్‌లో రాజుకుంటున్న రాజకీయ వేడి



అనుచరులతో సమావేశమైన గడ్డం అరవింద్‌రావు

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో నిలిచే బీఆర్ఎస్ అభ్యర్థుల టికెట్ల కేటాయింపు ముగిసింది. ఆ పార్టీ అధిష్టానం ఉమ్మడి జిల్లాలోని పది స్థానాల్లో ఏడుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మరోసారి టికెట్లు కేటాయించగా.. మరో మూడు స్థానాల్లో అభ్యర్థులను మార్చి కొత్త వారిని రంగంలోకి దించుతోంది. దీంతో టికెట్ లభించని సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ ఏకంగా అధిష్టానంపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు అక్కడ టికెట్ లభించని జాన్సన్ నాయక్ ఎస్టీయే కాదని సంచలన వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇక బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు మాత్రం ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటనే ఉంటానని ప్రకటించినప్పటికీ..రానున్న రోజుల్లో పరిణామాలు ఎలా ఉంటాయోననే చర్చ జరుగుతోంది. ఇక ఆసిఫాబాద్‌లో టికెట్ లభించని సిట్టింగ్ ఎమ్మెల్యే ఆత్రం సక్కును ఎంపీ టికెట్ భరోసా ఇవ్వడంతో ఆయన సైలెంట్ అయ్యారనే ప్రచారం జరుగుతోంది. వీరితో పాటు ఇది వరకే పలు నియోజకవర్గాల్లో టికెట్లు ఆశించి వివిధ కార్యక్రమాలు చేపట్టిన పలువురు ఆశావహులు రానున్న ఎన్నికల్లో పోటీలో ఉండేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. టికెట్ల పర్వం ముగిసిన తర్వాత బీఆర్ఎస్‌లో రాజకీయ వేడి మరింత రగులుతోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీకి రానున్న ఎన్నికల్లో అసమ్మతి బెడద తీవ్రమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికే టికెట్ల కేటాయింపు ముగిసిపోవడంతో దక్కిన వారు సంతోషం వ్యక్తం చేయగా.. టికెట్ రాని వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి పది అసెంబ్లీ స్థానాల్లో ప్రస్తుతం అందరూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కానీ ఎన్నికల నాటికి పరిణాలు మారుతాయోమోననే ఉద్దేశంతో పలువురు నాయకులు ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు అసమ్మతి వాదులుగా మారారు. ఎమ్మెల్యేలకు సమానంగా వివిధ పార్టీ కార్యక్రమాలు చేపడుతూ ప్రజల్లో ఉంటూ వచ్చారు. ఈ సారి కొన్ని చోట్ల సిట్టింగ్ ఎమ్మెల్యేలకు కాకుండా తమకు టికెట్లు వచ్చే అవకాశం ఉందని ప్రచారం చేసుకుంటూ వచ్చారు. కానీ కేవలం మూడు స్థానాల్లో మాత్రమే బీఆర్ఎస్ అధిష్టానం సిట్టింగ్‌లను మార్చగా.. మిగితా ఏడు స్థానాల్లో ప్రస్తుత ఎమ్మెల్యేలకే టికెట్లు కేటాయించింది. దీంతో టికెట్ దక్కని స్థానాలతో పాటు మిగితా స్థానాల్లోనూ టికెట్ ఆశించిన వారు ఆ పార్టీ అధిష్టానం తీరుపై ఆగ్రహంతో ఉన్నారు. ఒకటి రెండు చోట్ల మాత్రమే అసమ్మతి వాదులు సర్దుకుపోయే అవకాశం ఉందని మిగితా చోట్ల మాత్రం రెబెల్స్‌గా పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది.

సహకారంపై అనుమానం..!

బీఆర్ఎస్ అధిష్టానం టికెట్లు కేటాయించిన అభ్యర్థులకు అసమ్మతి వాదులు ఎంత మేరకు సహకరిస్తారనే అనుమానాలు తలెత్తుతున్నాయి. ఆదిలాబాద్ నియోజకవర్గంలో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జోగు రామన్నకు పార్టీ అధిష్టానం మరోసారి టికెట్ కేటాయించింది. దీంతో అసమ్మతి వర్గంగా ఉన్న మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ రంగినేని మనీషా సైతం ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు పార్టీ టికెట్ ఆశించారు. కానీ నిరాశ ఎదురుకావడంతో రెబెల్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. బోథ్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావును కాదని నేరడిగొండ జడ్పీటీసీ అనిల్‌జాదవ్‌కు పార్టీ టికెట్ కేటాయించింది. దీంతో ఎమ్మెల్యేతో పాటు ఆయన వర్గీయులు అసంతృప్తితో ఉన్నారు. ప్రస్తుతం తాను ముఖ్యమంత్రి వెంటే ఉంటానని బాపురావు చెబుతున్నప్పటికీ.. టికెట్ లభించిన అనిల్ జాదవ్‌కు ఆయన ఎంత మేరకు సహకరిస్తారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే నియోజకవర్గం నుంచి టికెట్ ఆశించిన మాజీ ఎంపీ గోడం నగేష్ సైతం అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఖానాపూర్ టికెట్‌ను సిట్టింగ్ ఎమ్మెల్యేను కాదని ఎన్ఆర్ఐ, మంత్రి కేటీఆర్‌కు సన్నిహితుడు జాన్సన్ నాయక్‌కు టికెట్ కేటాయించింది. దీంతో ఇక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్ పార్టీ అధిష్టానం తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాన్సన్ నాయక్ ఎస్టీ కాదని వ్యాఖ్యలు చేయడంతో పాటు రానున్న ఎన్నికల్లో పోటీలో ఉండేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. బెల్లంపల్లిలో సిట్టింగ్ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకే మరోసారి టికెట్ కేటాయించగా.. ఇక్కడ టికెట్ కోసం ప్రయత్నాలు చేసిన గ్రంథాలయ ఛైర్మెన్ రేణిగుంట ప్రవీణ్ అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఇక మంచిర్యాలలో ప్రస్తుత ఎమ్మెల్యే దివాకర్‌రావుకే మరోసారి టికెట్ దక్కడంతో అక్కడ టికెట్ ఆశించిన మాజీ ఎమ్మెల్యే అరవిందరెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రెబెల్‌గా బరిలో నిలిచేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ బీసీలకు టికెట్ కేటాయించాలని ఆ సామాజికవర్గం మొదటి నుంచి కోరుతోంది. కానీ అధిష్టానం పట్టించుకోకపోవడంతో ఆ పార్టీలోని బీసీ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మిగితా నియోజకవర్గాల్లో అసమ్మతి స్వరాలు అంతగా లేకపోవడంతో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఇబ్బందులు లేకుండా ఉంది. అసమ్మతి బెడదను నివారించేందుకు పార్టీ అధిష్టానం రంగంలోకి దిగే అవకాశం ఉందని ఆ పార్టీ నాయకులు భావిస్తున్నారు. ఎన్నికల నాటికి అన్ని సర్దుకుంటాయని చెబుతున్నారు.

త్వరలో ఎల్లంపల్లి నిర్వాసితులకు పూర్తి పరిహారం : దివాకర్‌రావు



నవతెలంగాణ - హాజీపూర్

త్వరలో ఎల్లంపల్లి నిర్వాసితులు మిగిలిపోయి ఉన్న పరిహారం అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని గుడిపేట్‌లో ఈజీఎస్ నిధుల నుండి రూ.20లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంబిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుడిపేట్ జిల్లాలోనే పేరొందిన గ్రామంగా వెలుగొందుతున్నారు. మెడికల్ కాలేజీ, మహాత్మా జ్యోతి బాపూలే, కేంద్రీయ విద్యాలయాలు గుడిపేట్‌లోనే ఏర్పాటయ్యాయని పేర్కొన్నారు. రాబోవు రోజుల్లో మండలాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానన్నారు. రాష్ట్రాన్ని దేశానికి రోల్ మోడల్‌గా అభివృద్ధి చేస్తున్న కేసిఆర్ ప్రభుత్వాన్ని మూడోసారి ఏర్పాటుకు అమూల్యమైన ఓటే ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శేషాద్రి, సర్పంచ్ లగిశెట్టి లక్ష్మి రాజయ్య వైస్ ఎంపీపీ బేతు రమాదేవి, ఎంపీటీసీ ఒడ్డే బాలరాజు, ఎంపీడీఓ అబ్దుల్, ఏపీఓ మల్లయ్య, మొగిలి శ్రీనివాస్, మందపల్లి శ్రీనివాస్, దొమ్మటి బాపు, బేర పోచయ్య కందుల రమేష్ పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న మహారాష్ట్ర ఎమ్మెల్యే



నవతెలంగాణ - రెబ్బెన

మండలంలోని గంగాపూర్ గ్రామ శ్రీబాలాజీ వెంకటేశ్వర స్వామిని మహారాష్ట్ర గడ్చిరోలికి చెందిన ఎమ్మెల్యే దేవరమడుగు హూలీ శనివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ పూజారి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. బీజేపీ నాయకులు వెంకటేశ్వర స్వామి చిత్రపటం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గోలెం తిరుపతి, కొలిపాక కిరణ్‌కుమార్, సునీల్ చౌదరి, కృష్ణకుమారి, సొల్లు లక్ష్మి, రాంబాబు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో శ్రావణమాసాన్ని పురస్కరించుకొని శనివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. దూర ప్రాంతాల నుండి స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఓటరు నమోదు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, నమోదు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని ఎలక్ట్రోల్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో కడెం సురేష్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని పలు పోలింగ్ స్టేషన్లను డిప్యూటీ తహసీల్దార్ పోచయ్యతో కలిసి పరిశీలించి బిఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ నమోదు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ నెల 27న ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రంలో కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు ఓటర్ లిస్ట్‌లో వివరాలు తప్పుగా ఉంటే సవరణ చేసుకోవచ్చని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని, 1 అక్టోబర్ 2023 నాటికి 18 ఏళ్లు నిండబోయేవారు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులని తెలిపారు.

వికలాంగులకు పెన్షన్లు పంపిణీ

నవతెలంగాణ - బెజ్జూర్

మండలంలో కొత్తగా మంజూరైన వికలాంగుల పెన్షన్లను శనివారం ఎంపీపీ రోజా రమణి ఎంపీడీఓ కార్యాలయంలో పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని గోల్కొండ గ్రామానికి చెందిన నికాడి అమృతకు సీఎం రిలీఫ్ ఫండ్ రూ.25వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుష్పలత, పీఏసీఎస్ చైర్మన్ ఓంప్రకాష్, ఎంపీటీసీలు పర్వీన్ సుల్తానా, లంగారి శ్రీనివాస్, గురిజాల వెంకన్న, మండల కోఆప్షన్ సభ్యుడు బశరత్‌ఖాన్, నాయకులు వెంకన్న, నరేందర్‌గౌడ్, జావిద్ అలీ, జావిద్ హుస్సేన్, పుల్లూరి సతీష్, మహేష్ పాల్గొన్నారు.

కలకలం రేపుతున్న చిరుతపులి సంచారం

- అడుగుజాడలు కనుక్కున్న అధికారులు

నవతెలంగాణ-నిర్మల్

వారం రోజుల క్రితం నుంచి జిల్లా కేంద్రంలోని విశ్వనాథ్‌పేట్, బంగాల్‌పేట్, వినాయక సాగర్ చెరువు, వెళ్లే రహదారి వెంట ఉన్న అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తూ పలువురికి కనిపించిన విషయం తెలిసిందే. కాగా మీడియా ద్వారా చిరుతపులి సంచారం వీడియోలు వైరల్ కావడంతో అటవీశాఖ అధికారులు రంగ ప్రవేశం చేశారు. చివరికి శనివారం చిరుతపులి అడుగుజాడలు కనుక్కున్నారు. కాలనీవాసులు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా బయటకు వెళ్లవద్దని సూచించారు. కాగా చిరుతపులి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

1న మహా ధర్నాను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-నిర్మల్

విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలపై ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే సెప్టెంబర్-1 హైదరాబాద్‌లోని ధర్నా చౌక్‌లో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ జిల్లా నాయకులు జాదవ్ వెంకట్‌రావు, పెంట అశోక్, దాసరి శంకర్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఈ మేరకు ధర్నాను జయప్రదం చేయడానికి హైదరాబాద్ నుంచి ఆదివారం సంఘం బృందాలు నిర్మల్ వస్తున్నాయని తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పింఛన్ల భవనంలో ఏర్పాటు చేసే సమావేశంలో అనుబంధ సంఘాల నాయకులు, సభ్యులు హాజరుకావాలని కోరారు.

ప్రశ్నించడానికి హక్కులపై అవగాహన అవసరం

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి
- సీఐటీయూలో పలువురి చేరిక



నవతెలంగాణ-జైపూర్

కార్మికులు తమకు దక్కాల్సిన హక్కుల పట్ల అవగాహన కల్గి ఉండాలని, అప్పుడే ప్రశ్నించేతత్వం అలవడుతుందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి అన్నారు. శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్షులు గుల్ల బాలాజీ అధ్యక్షతన శనివారం ఇందారం-1ఏ గని కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యాన్ని ప్రశ్నించాలంటే ముందుగా కార్మికులు వారి హక్కుల పట్ల అవగాహన కల్గి ఉండాలన్నారు. సింగరేణి గనుల్లో కొత్తగా చేరుతున్న కార్మికులకు వారికి దక్కాల్సిన హక్కులపై సీఐటీయూ అవగాహన కల్పిస్తోందని తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియా పరిధి ఇందారం-1ఏ గని కార్మికులకు సొంతింటి పథకం, కార్మిక వాడల్లో గల సమస్యలు, సీఎంపీఎఫ్ వడ్డీ సవరణకు సీఐటీయూ పోరాటం చేస్తుందని తెలిపారు. కార్మికులు సైతం తమకు చెందాల్సిన హక్కులను తమవంతు బాధ్యతగా అడిగి తెల్సుకోవల్సిన అవసరమని పేర్కొన్నారు. ఈ విషయమై కార్మికులకు శిక్షణా తరగతులు ఇప్పించడానికి సీఐటీయూ సిద్ధంగా ఉందని తెలిపారు. ఇప్పుడిప్పుడే సింగరేణిలో చేరిన యువనాయకులు ఇలాంటి కార్యక్రమాలను అవగతం చేసుకోవాలని కోరారు. కార్మికుల హక్కుల విషయమై సీఐటీయూ చేపట్టిన అవగాహన కార్యక్రమాల ద్వారా యువ కార్మికులు భారీగా సీఐటీయూలో చేరుతున్నారని పేర్కొన్నారు. గడిచిన వారం రోజుల వ్యవధిలో ఆర్కే-6 గనితో పాటు ఐకే-1ఏ గని కార్మికులు పెద్ద ఎత్తున చేరుతున్నందున సీఐటీయూ శ్రీరాంపూర్ ఏరియాలో బలపడుతోందని పేర్కొన్నారు. సింగరేణి అభివృద్ధికి కృషి చేస్తున్న కార్మికులు తమ హక్కుల గురించి యాజమాన్యం, ప్రభుత్వంతో పోరాడి సాధించుకోవాలని, బతిమిలాడకూడదని పేర్కొన్నారు. సింగరేణిలో పని చేస్తున్న అధికారులు మనస్ఫూర్తిగా పని చేయలేకపోతున్నారని, వివిధ కారణాలతో బదిలీకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల సంఘాలు ఉన్నప్పటికీ నాయకులు స్పందించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. సంస్థ పరిరక్షణకు పాటుపడుతున్న అధికారులు రాజకీయాలకు అతీతంగా నిజాయితీగా పని చేసి సంస్థను కాపాడుకోవల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఇప్పటికే కోల్ ఇండియాలో ఆగస్టు నెల వేతనంతో పాటు ఏరియర్స్ ఇస్తున్నామని మూడు వారాల క్రితం సర్క్యులర్ జారీ చేసిందని, సింగరేణి మాత్రం ప్రభుత్వం నుండి రావల్సిన బకాయిలు రాకుండా ఆర్థిక లేమితో కొట్టుమిట్టాడుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ వెంగల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కస్తూరి చంద్రశేఖర్, డివిజన్ నాయకులు శ్రీపతి బానేష్, బోడకుంట శంకర్, సాయిల శ్రీనివాస్, మిడివెల్లి రాజ్‌కుమార్ ఉన్నారు.

సీఐటీయూలో పలువురి చేరిక

కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటంతో పాటు కార్మికుల హక్కులపై అవగాహన కల్పిస్తున్నందున యువ కార్మికులు సీఐటీయూలో చేరుతున్నారని రాష్ట్ర అధ్యక్షులు రాజారెడ్డి తెలిపారు. శనివారం ఇందారం-1ఏ గనిలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐటీయూలో చేరిన పలువురికి కండువా కప్పి ఆహ్వానించారు. సీఐటీయూలో చేరిన వారిలో ఈఎల్ఎఫ్(ఎం) తుమ్మల కిషన్‌రెడ్డి, (ఓఎం)అంబాల శ్రీనివాస్, అజయ్, శ్రీనివాస్, వెంకటొరెడ్డి, సిరికొండ శ్రీను, తాళ్ల వినయ్, అనంతయ్య, రేగుంట నగేష్, మేడ సందీప్, సతీష్, కీర్తి కుమార్, నవీన్, సంతోష్, చంద్రశేఖర్, రాజు, ప్రశాంత్, శ్రీనివాస్ (ఓఎం) ఉన్నారు.

అక్కున చేర్చుకున్న అభిమానం

- బాల్క సుమన్‌కు ఘన స్వాగతం



నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ నియోజకవర్గం నుండి 2వ సారి ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం పొందిన సిట్టింగ్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌ను అభిమానులు అక్కున చేర్చుకున్నారు. శనివారం నియోజకవర్గానికి వచ్చిన బాల్క సుమన్‌కు నాయకులు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. హైదరాబాద్ నుండి వచ్చిన సుమన్‌కు ఇందారం, జైపూర్‌లలో ఘన స్వాగతం పలికారు. గజమాలతో స్వాగతించారు. ఎంపీపీ గోదారి రమాదేవి లక్ష్మన్, జెడ్పీటీసీ మేడి సునిత తిరుపతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బలమూరి అరవింద్‌రావు, ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం అధ్యక్షులు గుండు తిరుపతితో పాటు వివిధ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు ఇందారం నుండి చెన్నూర్‌కు మోటార్ సైకిళ్ల ర్యాలీ చేపట్టారు. ఇది విజయోత్సవ ర్యాలీని తలపించింది. కార్యక్రమంలో సుమన్‌తో పాటు పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత, ఎమ్మెల్సీ దండె విఠల్, రాష్ట్ర నాయకులు పూస్కూరి రాంమోహన్‌రావు ఉన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నం

నవతెలంగాణ - రెబ్బెన



గంగాపూర్ గ్రామ శివారులో జాతీయ రహదారి పక్కన గల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు మండలంలోని కొందరు రాజకీయ పార్టీల నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. మండల కేంద్రం నుండి జాతీయ రహదారి వెళ్తుండడంతో రహదారి పక్కనున్న భూములకు విలువ పెరిగింది. రహదారి పక్కన ప్రభుత్వ భూములు ఖాళీగా ఉంటే ఆక్రమించేందుకు కొందరు నాయకులు ముఠాగా ఏర్పడుతున్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. జాతీయ రహదారి పక్కన ప్రభుత్వ స్థలంలో గతంలో ప్రభుత్వ కార్యాలయాల కొరకు కాంట్రాక్టర్ భవన నిర్మాణం చేపట్టారు. ఈ భవన నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. దీంతో భవనం ఉన్న స్థలం పక్కనున్న ఖాళీ స్థలాన్ని ఆక్రమించేందుకు శనివారం భవనం చుట్టూ ప్రహరిగోడ కట్టేందుకు సామగ్రి తెచ్చి పనులు చేపట్టారు. అధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు అవగాహనా సదస్సు



నవతెలంగాణ - కాసిపేట

మండల కేంద్ర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు షీ టీమ్స్ ఉపయోగాలు, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ పి.గంగారాం మాట్లాడుతూ మహిళలు, ఆడపిల్లల రక్షణ కోసం చేసిన చట్టాలను తెలుసుకొని ఉపయోగించుకోవాలన్నారు. బాలికలకు బాల్య వివాహాలు జరపాలని ప్రయత్నం చేస్తే సమాచారం ఇవ్వాలన్నారు. మహిళలు, విద్యార్థుల రక్షణ కోసం షీ టీమ్స్, సురక్షితమైన ప్రయాణం కోసం అభయ యాప్‌ల ఏర్పాటు, ఉపయోగం, నేరాల నియంత్రణకు పోలీసు శాఖ కృషి చేస్తోందని పేర్కొన్నారు. పోలీసులకు ప్రజలందరు సహకరించాలని కోరారు. విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంక్ లావాదేవీలను ఆసరాగా చేసుకుని మోసగాళ్లు నేరాలు చేస్తూ సామాన్య ప్రజలను దోచుకుంటున్నారని, తల్లిదండ్రులకు విద్యార్థులు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థి దశ నుండే ట్రాఫిక్ నియమాలపై అవగాహన ఉండాలని, తమ తల్లిదండ్రులు వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు కలిగి ఉండే విధంగా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ కరపత్రాల విడుదల



నవతెలంగాణ-నిర్మల్

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్స్‌ను వెంటనే పర్మినెంట్ చేస్తూ, ఉద్యోగ భద్రత కల్పించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టియు) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సునారికారి రాజేష్, ఎం హరిత డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో ఈ నెల 29న నిర్వహించే చలో హైదరాబాద్ కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్మికులు వెట్టిచాకిరి చేస్తున్నారని, కనీస ఉద్యోగ భద్రత లేదని తెలిపారు. ప్రభుత్వ విధానాల వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. చాలీచాలని వేతనాలతో పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు లేవని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలన్నింటిని ప్రైవేటీకరిస్తూ కార్పొరేట్ సంస్థలకు గంపగుత్తగా అమ్మి వేస్తోందన్నారు. కార్మికులను తొలగించి చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్చి వేసిందన్నారు. కార్మిక సమస్యల పరిష్కారం కోసం జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య విలాస్, సభ్యులు పాల్గొన్నారు.

నేడు గద్దర్ సంస్మరణ సభ

ఆదిలాబాద్‌టౌన్ : ప్రజాకవి, వాగ్గేయకారుడు గద్దర్ సంస్మరణ సభ ఆదివారం నిర్వహిస్తున్నామని ప్రముఖ కవి డాక్టర్ ఉదారి నారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 3గంటలకు స్థానిక కార్మిక సంఘ భవనంలో నిర్వహించే సభకు కవులు, కళాకారులు, సాహితీ అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సబ్ జైలులో బ్రహ్మకుమారీల రక్షాబంధన్ వేడుకలు



ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సబ్ జైలులో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్షాబంధన్ వేడుకలకు జిల్లా జడ్జి ఎంవి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైలులో ఉన్నప్పటికీ బంధాలను మరిచిపోకూడదన్నారు. బంధాలు మనుషులు చేసే తప్పులను చేయకుండా సహాయపడతాయన్నారు. జైలు జీవితంతో ఖైదీల ప్రవర్తనలో పరివర్తన రావాలని సూచించారు. క్షణికావేశంలో చేసిన తప్పులతో కుటుంబం రోడ్డున పడుతుందన్నారు. జైలులో నేర్చుకున్న పలు మంచి అంశాలు నిత్య జీవితంలో వర్తింపచేసుకోవాలని సూచించారు. నేర ప్రవృత్తి వల్ల సమాజంలో గుర్తింపు కోల్పోయే ప్రమాదం ఉంటుందన్నారు. చట్టాలపై ఖైదీలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతిరోజు ఖైదీలు మెడిటేషన్ చేయడం అలవాటు చేసుకోవాలని, దీనివల్ల చెడు ఆలోచనలు తొలగిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారి ప్రేమ్‌కుమార్, అడ్వకేట్ నరహరి, లీగల్ అసిస్టెంట్ అంజనీదేవి, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

అనుదినం జనపక్షం www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్
2
ఆదివారం 27 ఆగస్టు 2023

రాజురాలో రోడ్డు, వంతెనల సర్వే

నవతెలంగాణ-ఖానాపూర్



ఖానాపూర్ మండలంలోని రాజురా గ్రామపంచాయతీ నుంచి మందపెల్లి వరకు రోడ్డు, రెండు బ్రిడ్జిల కోసం శనివారం సంబంధిత అధికారులు సర్వే నిర్వహించారు. రాజురా చుట్టుపక్కల గ్రామాల చిరకాల కోరిక నెరవేరుతుందని నాయకులు చిన్నం రవీందర్, నిమ్మా నాయక్ అన్నారు. రోడ్డు నిర్మించడంతో సింగపూర్, బావపూర్, రాజురా, చందునాయక్ తండా, మండపెల్లి తదితర గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని అన్నారు. దూరభారం కూడా తగ్గుతుందని అన్నారు. ఇందులో రాములు నాయక్, గుమ్ముల లింగన్న, షకీర్, శ్రీధర్‌లు ఉన్నారు.

లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ

నవతెలంగాణ-ముధోల్



తెలంగాణ ప్రభుత్వం గొల్లకుర్మల కోసం ప్రభుత్వం సబ్సిడీ గొర్రెలను పంపిణీ చేస్తోందని జిల్లా పశు వైద్యాధికారి గంగాధర్ అన్నారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా 24 యూనిట్ల గొర్రెలను శనివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు వైద్యశాఖ సహాయ సంచాలకులు సురేష్, ముధోల్ మాజీ పీఏసీఎస్ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, సర్పంచ్ సాయినాథ్, ఎంపీటీసీ బండారి గంగాధర్, మండల వైద్యాధికారి డా.జి.రాజేష్, రవిందర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వృక్షాలతోనే మానవ జీవరాసుల మనుగడ

● ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు



తాంసి

నవతెలంగాణ-తాంసి

వృక్షాలతోనే మానవ జీవరాసుల మనుగడ ఉంటుందని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. శనివారం హరితహారంలో భాగంగా పొన్నారి గ్రామంలోని ఖాళీ స్థలాల్లో సర్పంచ్, అటవీశాఖ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం బీసీ ఆర్థిక చేయూత పథకంలో లబ్ధిపొందిన చేతివృత్తి కమ్మరి రవి పనిముట్ల తయారీ షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అదిలాబాద్ జిల్లా అడవుల జిల్లాగా గుర్తింపు ఉందని అన్నారు. గత ప్రభుత్వాల హయాంలో అడవులను నరికి వేశారని అన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత హరితహారం కార్యక్రమంలో అడవులను కాపాడి కోట్ల మొక్కలను పెంచడం జరిగిందని అన్నారు. అటవీశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధతో అడవులను కాపాడుతున్నారని అన్నారు. గ్రామాల్లో కూడా మొక్కలు నాటడంతో ప్రతి గ్రామం హరిత గ్రామాలుగా కనబడుతున్నాయని అన్నారు. వజ్రోత్సవాల ముగింపు కార్యక్రమంలో ప్రతి నియోజక వర్గంలో కోటి మొక్కలను నాటడం జరుగుతుందని అన్నారు. కేసీఆర్ సీఎం అయ్యాక కులవృత్తులకు ప్రత్యేక నిధులు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అశోక్, ఇన్‌ఛార్జి అటవీ శాఖ ఎఫ్‌డీఓ భర్నోభా, ఏపీడీ రవీందర్ రాథోడ్, ఎంపీపీ మంజుల శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజు, ఎంపీడీఓ భూమయ్య, వైస్ ఎంపీపీ రేఖారఘు, ఫారెస్ట్ సెక్షన్ అధికారి ఆమిద్ ఖాన్, నాయకులు రమణ, ప్రకాష్, గంగన్న, జీవన్‌రెడ్డి ఉన్నారు.

కుభీర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హరితహారంలో భాగంగా ప్రతి గ్రామంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో, శ్మశాన వాటికల్లో తదితర స్థలలో మొక్కలు నాటి వాటి సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని మండల వ్యవసాయ సహకార సంఘం, రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్ రేకుల గంగాచరణ్, మండల అధ్యక్షురాలు తూము లక్ష్మీబాయి అన్నారు. శనివారం స్వాతంత్ర్య భారత వజ్రోత్సవాల్లో భాగంగా కోటి మొక్కల కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో వ్యవసాయ సహకార సంఘం చైర్మెన్ పార్డి(బి) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ, సర్పంచ్ పుష్పాలత రాజేశ్వర్, పల్సి పాఠశాలలో ఎంఈఓ చంద్రకాంత్‌తో పాటు ఆయా గ్రామంలో ఉన్న స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోహియోద్దీన్, జెడ్పీటీసీ ఆల్కతాయి సంజయ్, మాజీ జెడ్పీటీసీ శంకర్ చవాన్, బీఆర్ ఎస్ మండల అధ్యక్షుడు అనిల్, కోఆప్షన్ సభ్యుడు దత్తుహరి పాటిల్, ఎంపీడీఓ లింబాద్రి, తహసీల్దార్ సోము, ఎస్సై షరీఫ్, ఆయా గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, ఎంపీటీసీలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద : హరితహారంలో భాగంగా శనివారం మండలంలోని అన్ని గ్రామాల్లో కోటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాచాపూర్ లో నిర్వహించిన కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మెన్ రఘునందన్‌రెడ్డి, ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గ్రామంలోని ఖాళీ ప్రదేశాలు, ప్రధాన కూడళ్లలో మొక్కలు నాటి సంరక్షణ చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శాతం బొర్రవ్వ గంగారాం, ఎంపీటీసీ బూసి రమ ముత్యం, ఎంపీడీఓ శేఖర్, ఎంపీఓ నసీరుద్దీన్, ఏపీఓ ప్రమీల, క్షేత్ర సహాయకులు జడ్డి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్ : మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శనివారం ఐటీ టవర్ అవరణలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చేపట్టినటువంటి ఒక రోజు కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా ఐటీ టవర్ నిర్మాణ స్థలంలో మున్సిపల్ చైర్మెన్ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఐటీ టవర్ నిర్మాణం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శైలజ, పట్టణ అధ్యక్షుడు అజయ్ కుమార్, ఐటీ టవర్ సిబ్బంది, కౌన్సిలర్‌ల బృందం, కాలనీవాసులు పాల్గొన్నారు.

రెండో బెటాలియన్‌లో..

మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శనివారం స్వతంత్ర భారత వజ్రోత్సవాల్లో భాగంగా ఒక రోజు కోటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని యాపల్‌గూడ రెండవ బెటాలియన్‌లో ఆయన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జోగు రామన్నతో పాటు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, బెటాలియన్ కమాండెంట్ పీజేపీసీ చటర్జీ పాల్గొన్నారు. మొక్కల సంరక్షణకు పాటుపడుతున్న ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ కుష్బూ, అడిషనల్ కమాండెంట్ ఎం.జయరాజు, అసిస్టెంట్ కమాండెంట్ టీ.పాని, పి.కృష్ణ ప్రసాద్, కే.అప్పరాయ్, కేవీవీ ప్రసాద్ ఆర్ఐ, ఆర్ఎస్సైలు, ఎంపీపీ గంద్రత్ రమేష్, గ్రామ సర్పంచ్ పెందురు గంగారాం, బీఆర్ఎస్ నాయకులు జగదీష్ యాదవ్, కుమ్ర రాజు, పరమేశ్వర్, బెటాలియన్ సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్ : మండల కేంద్రంలోని పలు గ్రామాల్లో ఘనంగా కోటి వృక్షార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ సరిత మొక్కలు నాటారు. న్యూలోలం గ్రామంలో ఎంపీడీఓ మోహన్ ఆధ్వర్యంలో సర్పంచ్ ఒడ్నం సవిత కృష్ణ మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు కళాశాలలో 80



ఆదిలాబాద్‌రూరల్

మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.శంకర్ మాట్లాడుతూ భూతాపాన్ని తగ్గించాలన్న, స్వచ్ఛమైన ప్రాణవాయువు అందాలన్నా, సమృద్ధిగా వర్షాలు కురియాలన్నా, పర్యావరణంలో సమతుల్యం ఉండాలంటే మొక్కలు నాటాలని పేర్కొన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ కూడా మునందరి బాధ్యతని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : గత ప్రభుత్వాలు పర్యావరణ పరిరక్షణను విస్మరించాయని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శనివారం వజ్రోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం అగ్రజ టౌన్ షిప్ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా హరితహారం వంటి బృహత్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు. పర్యావరణ పరిరక్షణపై గత ప్రభుత్వాలు దృష్టి సారించలేదని, తెలంగాణ ఏర్పడిన తర్వాత పచ్చదనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా హరితహారం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు. దీని ద్వారా రాష్ట్రంలో పచ్చదనం గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు తగు ప్రాధాన్యతను ఇస్తూ మొక్కలను సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ శైలజ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, కౌన్సిలర్ ఆవుల వెంకన్న, నాయకులు మిషు, సి.నరేందర్, ఆర్ఐ వెంకటేష్ పాల్గొన్నారు.

నార్నూర్ : మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎంపీపీ కనక మోతుబాయి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకులం పాఠశాల అవరణలో మొక్కలు నాటారు. అదేవిధంగా జామడ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినులు మొక్కలను నాటారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, స్థానిక సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్, ఎంపీడీఓ కావల రమేష్, ప్రిన్సిపల్ ఉపేందర్, టీప సచిన్, కార్యదర్శి దినేష్, జామడ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నెహ్రూ, పీడీ విశ్వనాథ్, ఉపాధ్యాయులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.



లక్ష్మణచాంద

విద్యార్థులకు క్రీడా సామాగ్రి అందజేత



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన కాటిపెల్లి శ్రీనివాసరెడ్డి రూ.15వేలు, రూయ్యాడి గ్రామానికి చెందిన గోక జీవన్‌రెడ్డి రూ.5వేలతో కలిపి మొత్తం రూ20వేల విలువ గల క్రీడా సామాగ్రిని శనివారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. ఆటలు ఆడటంతో శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం పెంపొందుతుందని అన్నారు. ఇక ముందు కూడా నావంతుగా సాయాన్ని అందించేందుకు ముందుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చంటి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వినోద్‌రెడ్డి, పాఠశాల చైర్మెన్ నేతుల గంగన్న లక్ష్మణ్‌రావు, కటక్కం దేవన్న, ప్రవీణ్‌రెడ్డి, అల్లూరి స్వామి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి జనసేన ఆర్థిక సాయం



నవతెలంగాణ-దిలావర్‌పూర్

గత ఏడాది పెండ్లి భరత్‌లో జరిగిన యువకుల తోపులాట ఘటనలో మెగావత్ నవీన్(28) యువకుడు మృతి చెందాడు. యువకునికి భార్య కూతురు ఉన్నారు. మృతుడు జనసేన పార్టీలో క్రియాశీల సభ్యుడు అయినందున మృతుని వివరాలు తెలుసుకున్న జనసేన పార్టీ అధినాయకత్వం నటుడు పవన్ కళ్యాణ్ మృతుని కుటుంబీకులను హైదరాబాద్ కార్యాలయానికి పిలిపించి, తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జి నేమూరి శంకర్‌గౌడ్ చేతుల మీదుగా శనివారం నవీన్ భార్య సరితకు ఐదులక్షల చెక్కును అందజేశారు. వారి వెంట జనసేన నాయకులు రాజలింగం, దామోదర్‌రెడ్డి, కాల్వతండ సర్పంచ్ రామావత్ నీలాబాయి రవి, అభిమాన సంఘ నాయకులు శ్రీరాముల శ్రీనివాస్, అంగోత్ టీకాజీ, రవీందర్, జే.మిట్య రూపేందర్, రోహిదాస్, ఎం.నవీన్, సురేష్, ఎ.తరుణ్, శ్రీరాముల తేజ ఉన్నారు.

సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా పల్సి యువకుడి ఎంపిక

నవతెలంగాణ-కుభీర్



మండలంలోని పల్సి గ్రామానికి చెందిన అల్లం ఈరబాయి గజ్జరాం దంపతుల కుమారుడు అల్లెం యోగేష్ ఇటీవల విడుదలైన సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ ఫలితాల్లో సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా ఎంపికయ్యాడు. అల్లం యోగేష్ తల్లిదండ్రులు వ్యవసాయ కుటుంబానికి చెందిన వారు ప్రతి రోజు కష్టపడి వ్యవసాయ పనులు చేసుకుంటూ తమ కుమారుడికి మంచి చదువులు చదివించేందుకు వారుపడ్డ కష్టానికి ఫలితం లభించడంతో వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యోగేష్ మాట్లాడుతూ ప్రాథమిక విద్యను తానూర్ మండలంలోని బోసి గ్రామంలో 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పల్సి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేసి, అక్కడి నుంచి మరింతగా ఉన్నత స్థాయి చదువుల కొరకు హైదరాబాద్‌లో చదువుతూ ఫిబ్రవరి 10న జరిగిన పోలీస్ రిక్యూరిట్‌మెంట్‌లో పాల్గొని, ఇటీవల ఆగస్టు 20న వెలువడిన ఫలితాల్లో సీఆర్పీఎఫ్ ఫలితాల్లో ఎంపికయ్యాని తెలిపారు. దీంతో శనివారం గ్రామస్తులు కుటుంబ సభ్యులకు, యువకుడికి శాలువాతో సన్మానించారు.

కాంగ్రెస్ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి

నవతెలంగాణ-కడెం



కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక కార్యకర్త కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్ అన్నారు. శనివారం మండలంలోని పాండ్వాపూర్, నవాబ్‌పేట్, కల్లెడ గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు విభాగం జిల్లా అధ్యక్షులు బరపటి రమేష్, పడిగెల భూషణ్, జక్కుల వెంకటి, తాళ్లపల్లి రమేష్, జక్కుల శ్రీనివాస్, తుమ్మల ప్రతాప్, కొండ్ర మల్లయ్య, బండి అంజన్న, సుధాకర్, సోధాని రాజన్న, మేడి లచ్చన్న, సింగం చందు, తుమ్మల రామన్న, బత్తుల వెంకటేష్ పాల్గొన్నారు.

భూక్యా జాన్సన్ నాయక్‌కు ఘన సన్మానం



నవతెలంగాణ-కడెం

సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ అభ్యర్థిగా భూక్యా జాన్సన్ నాయక్‌ను ప్రకటించగా శనివారం ఆయన నివాసంలో బీఆర్ఎస్ మండల నాయకులు ఘనంగా సన్మానించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు నల్ల జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు వేసి, శాలువా కప్పి ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపసర్పంచ్‌లు, గ్రామాధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-కడెం

చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండాలని ఖానాపూర్ జూనియర్ సివిల్ జడ్జ్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జితిన్ కుమార్ అన్నారు. శనివారం మధ్యాహ్నం మండలంలోని ఉడుంపూర్ గ్రామంలో మండల లీగల్ సర్వీస్ అథారిటీ అధ్వర్యంలో గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జడ్జీ జితిన్ కుమార్ పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఎటువంటి సమస్యలు ఉన్న కోర్టును ఆశ్రయించాలని, లేదా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని అన్నారు. కానీ క్షణికావేశాలతో చట్టాలను తమ చేతిలోకి తీసుకొని నేరాలకు పాల్పడవద్దని కోరారు. కోర్టులో ప్రతి ఒక్కరికి న్యాయం తప్పక జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లక్ష్మీ లక్ష్మణ్, న్యాయవాదులు వీవీ రమణరావు, వెంకట్, మహేంద్ర, బాసెట్టి శివ, ఏఎస్సై భీంరావు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మల్బరీ మొక్కల ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించిన విద్యార్థులు

నవతెలంగాణ-కడెం



ఖానాపూర్ మండలంలోని విజేత పాఠశాల విద్యార్థులు కడెం మండలంలోని నచ్చన్‌ఎల్లపూర్‌లోని మల్బరీ మొక్కల ఉత్పత్తి కేంద్రాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మల్బరీ మొక్కల పెంపకం, వాటి సంరక్షణను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పుస్తకంలో నేర్చుకున్న అంశాలను ఇలా ప్రాజెక్టు పద్ధతిన వివరించడం ద్వారా విద్యార్థుల్లోని సృజనాత్మకతను మెరుగు పరచవచ్చని పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్ అన్నారు. వనంలో విద్యార్థులు ఎంతో చక్కగా మల్బరీ మొక్కల పెంపకం, వాటి ఉపయోగాలను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ వివరాలు అన్నింటినీ సేకరించి, ప్రాజెక్టు తయారు చేసి, పాఠశాలలో అందిస్తామని విద్యార్థులు అన్నారు. ఇందుకు సహకరించిన అధికారులకు విజేత పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో మల్బరీ మొక్కల ఉత్పత్తి కేంద్ర అధికారులు, ఉపాధ్యాయులు సుధాకర్, సుష్మిత, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రూప్-2 శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లాలోని అల్పసంఖ్యాక వర్గాల నిరుద్యోగులకు గ్రూప్-2 శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని డీఎండబ్ల్యూఓ కృష్ణవేణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన వంద మంది అభ్యర్థులకు 45 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తారని, ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి కార్యాలయంలో ఆగస్టు 31లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9440332859 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని ధర్నా



నవతెలంగాణ-నిర్మల్

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం ముందు ఆశ కార్యకర్తలు శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ మాట్లాడారు. ఆశా కార్యకర్తలు అనేక పని ఒత్తిడి తట్టుకొని నిత్యం సేవలు అందిస్తున్నారని అన్నారు. అందువల్లే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి అవార్డులు, వచ్చాయన్నారు. కనీస వేతనం నిర్ణయం చేయాలని ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు. కనీస వేతనం రూ.18వేలు వచ్చేవరకు పోరాటం ఆపేది లేదని తేల్చి చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కరోనా రిస్క్ అలవెన్స్ తన ఖాతాలో వేసుకుందని అన్నారు. వాటిని విడుదల చేయటానికి చేతులు రావటం లేదని విమర్శించారు. పీఆర్సీ, ఎరియర్స్ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని అన్నారు. అనంతరం ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ మాట్లాడుతూ కరోనా కాలంలో ప్రజల ప్రాణాలు కాపాడిన మహిళ సైనికులు ఆశా కార్యకర్తలని అన్నారు. కంటి వెలుగు, లెప్రసీ, మలేరియా, టీబీ గుర్తింపు కార్యక్రమంలో అత్యున్నత పాత్ర వహించారని అన్నారు. కాని ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయలేని పరిస్థితిలో ఉందని మండిపడ్డారు. ఈ నెల 29న ఎమ్మెల్యేల ఇంటి ముందు, ధర్నా, సెప్టెంబర్ 5న పీహెచ్‌సీల ముందు ధర్నా, సెప్టెంబర్ 11న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అధిక సంఖ్యలో ఆశా కార్యకర్తలు పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, రామలక్ష్మి, వర్ధమాల, ఇంద్ర, రాధా, స్రవంతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'వస్తున్న మీకోసం' యాత్ర

నవతెలంగాణ-లక్ష్మణచాంద

డీసీసీ అధ్యక్షుడు కుచాడి శ్రీహరిరావు చేపట్టిన వస్తున్న మీకోసం యాత్ర కొనసాగుతుంది. శనివారం మండలంలో రెండో రోజు ధర్మారం, పొట్టపెల్లి, కనకపూర్ గ్రామాల్లో సాగింది. నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకే పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలు, మేనిఫెస్టోను వివరించారు. గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఇటు రాష్ట్రంలో బీఆర్ఎస్, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాలు ప్రజలకు చేసింది ఏమి లేదని అన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే పెన్షన్ రాదని చెప్పే బీఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మవద్దని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ.4వేల పెన్షన్, రెండు లక్షల రైతు రుణమాఫీ, ఎకరానికి రూ.15వేల పెట్టుబడి సాయం, నిరుద్యోగ భృతి అందిస్తామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని అన్నారు. కేంద్రం, రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఒడ్నాల రాజేశ్వర్, ఈటెల శ్రీనివాస్, అట్ల రామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అట్ల రవీందర్‌రెడ్డి, నాందేడపు చిన్ను పాల్గొన్నారు.



ఆశా కార్యకర్తలకు సంఘీభావం...

మండలకేంద్రంలో సమ్మె చేస్తున్న ఆశా కార్యకర్తలకు శ్రీహరిరావు సంఘీభావం తెలిపారు. ఇప్పటికైనా గౌరవ వేతనం అమలు చేసి, ఆశా సిబ్బందిని ఆదుకోవాలని అన్నారు.

ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్ జాబితా ప్రదర్శన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జిల్లాలో వందశాతం ఓటరు నమోదు దిశగా రెండు రోజుల ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణ, రూరల్ మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి సూపర్‌వైజర్లు, బూత్ స్థాయి అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ముందుగా స్థానిక డైట్, ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి అతికించిన ఓటర్ జాబితా, ర్యాంపు, వీల్‌చైర్, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్, ఇతర మౌళిక వసతులను పరిశీలించారు. అనంతరం బూత్ స్థాయి అధికారులకు బీఎల్ఓ కిట్‌లను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు నమోదు శాతం పెంచేందుకు శని, ఆదివారం రెండు రోజుల ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం చేపట్టడం జరిగిందని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్ జాబితాను ప్రదర్శించడం జరిగిందని, ప్రతి ఓటరు తమ వివరాలను జాబితాలో పరిశీలించుకోవాలని కోరారు. ఓటరు జాబితాలో పేరు ఉన్న వారిని మాత్రమే ఓటు వేయడానికి అనుమతించడం జరుగుతుందని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు, జాబితాలో పేరు లేని, తొలగించబడిన వారు కొత్తగా ఓటరు నమోదుకు ఫారం-6, మరణించిన, తొలగించాలన్న ఫారం-7, మార్పులు, చేర్పులకు ఫారం-8లను బీఎల్ఓలకు అందజేయాలని సూచించారు. ప్రత్యేక నమోదు కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటారని, ప్రతి ఒక్కరూ జాబితాను పరిశీలించుకోవాలని తెలిపారు.

www.navatelangana.com
నవతెలంగాణ
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
ఆదివారం 27 ఆగస్టు 2023

ప్లాస్టిక్ నిషేధం అభినందనీయం

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని దేవునిగూడ గ్రామంలో ప్లాస్టిక్ నిషేధం అభినందనీయమని తహసీల్దార్ వనజారెడ్డి అన్నారు. శనివారం దేవునిగూడ గ్రామపంచాయతీలో పర్యటించిన ఆమె సర్పంచ్ గుర్రం శిరీష గోపాల్‌రెడ్డి, కార్యదర్శిలు సరితలు శాలువాతో సత్కరించారు. ప్లాస్టిక్ నిషేధానికి గ్రామములో ఉపయోగిస్తున్న బట్ట సంచులను చూసి, పంచాయతీ సిబ్బందిని అభినందించారు. పంచాయతీలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలపై ఆరా తీశారు. జిల్లాలోనే ఉత్తమ గ్రామ పంచాయతీగా అవార్డు తీసుకోవడానికి గ్రామ కార్యదర్శి సర్పంచ్ కృషి చేయాలని సూచించారు. అన్ని గ్రామాలకు ఆదర్శంగా నిలవాలని కోరారు.

విజిలెన్స్ అవగాహన వారోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-మందమర్రి



విజిలెన్స్ అవగాహన వారోత్సవాల పోస్టర్లను మందమర్రి ఏరియా జీఎం ఏ మనోహర్, సింగరేణి అధికారులతో కలిసి శనివారం ఆవిష్కరించారు. నవంబర్ 15 వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించాల్సిందిగా సెంట్రల్ విజిలెన్స్ విభాగం ఉత్తర్వులు జారీ చేసిందని జీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డీజీఎం ఐఈడి రాజన్న ఏజీఎం ఈఅండ్ఎం నాగరాజు, కెకె ఓసి ప్రాజెక్ట్ అధికారి రమేష్, శాంతిఖని ప్రాజెక్ట్ అధికారి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

లైసెన్సులు లేకుండా వాహనాలు నడపొద్దు

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్
- ఆదివాసీ యువతకు లెర్నింగ్ లైసెన్సులు అందజేత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

లైసెన్స్ లేకుండా ఎవరు కూడా వాహనాలు నడపకూడదని ఆదివాసీల కోసం ప్రభుత్వం అందిస్తున్న చేయూత సద్వినియోగం చేసుకోవాలని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని రోడ్డు రవాణా శాఖ కార్యాలయంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 18 మంది ఆదివాసి యువకులకు ఎస్పీ సురేష్ కుమార్, అదనపు ఎస్పీ అచ్చేశ్వరరావు, జిల్లా రోడ్డు రవాణా శాఖ అధికారి గంధం లక్ష్మితో కలిసి లైసెన్సులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను ఆదివాసీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రతి వాహనదారుడు లైసెన్స్ కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, కార్లు, ఇతర వాహనాలు నడిపేటప్పుడు కచ్చితంగా సీట్ బెల్ట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపకూడదని, ప్రభుత్వ నిబంధనల మేరకు వాహన సామర్థ్యానికి మించి వాహనాన్ని నడపకూడదని తెలిపారు. రోడ్డుపై వాహనాలు నడిపే సమయంలో మనపై ఆధారపడి జీవించే కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, సీఐ అల్లం రవీందర్, తిర్యాని ఎస్సై చుంచు రమేశ్ పాల్గొన్నారు.

'మహిళల రక్షణ పోలీసుల బాధ్యత'



నవతెలంగాణ-తాండూర్

మహిళలకు రక్షణ కల్పించడంలో పోలీసు యంత్రాంగం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని బెల్లంపల్లి సీఐ శంకరయ్య అన్నారు. ఆయన శనివారం 'మహిళల భద్రత-పోలీసుల బాధ్యత' కార్యక్రమంలో భాగంగా బెల్లంపల్లి బాలికల హాస్టల్ విద్యార్థులకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకొని మహిళలు, బాలికలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలు ఉన్నత శిఖరాలు అధిరోహించటానికి చదువు ఏకైక ఆయుధమని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి వృత్తిలో నైపుణ్యత సంపాదించుకుని మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలన్నారు. విద్యార్థినులు సమాజం, చట్టాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండడలన్నారు. ఆకతాయిలు బాలికలను భయాందోళనలకు గురిచేసినా, వేధించినా, ఇబ్బందికరంగా మాట్లాడిన వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 100, రామగుండం పోలీస్ కమిషనరేట్ షీ టీమ్స్ వాట్సాప్ 91 63039 23700 నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. రాఖీ పౌర్ణమి వారోత్సవాల సందర్భంగా నెన్నెలా ఎస్సై శ్యాం పటేల్, దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు, భీమిలి ఎస్సై మహేందర్, బెల్లంపల్లి వన్ టౌన్ ఎస్సై శంకరయ్య, రవికుమార్ కన్నెపల్లి ఎస్సై నరేష్, సీఐ రాజకుమార్ బాలికల విద్యాలయాల్లో గురుకులాల్లో మహిళల రక్షణ పోలీసుల బాధ్యత కార్యక్రమాన్ని నిర్వహించారు .

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-నస్పూర్

ఉపాధ్యాయ, విద్య రంగ సమస్యలు పరిష్కరించాలని యూఎస్పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు అశోక్ కుమార్, లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ, సమస్యల పరిష్కారనికై ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ చేపట్టిన దశల వారి పోరాట కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 1వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. యూఎస్పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు చేపట్టిందని, ఈ పర్యటనలో భాగంగా యూఎస్పీసీ బాధ్యులు శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రానికి రావడం జరిగిందన్నారు. ఈ జూన్ 30వ తేదీతో మొదటి వేతన సవరణ కమిషన్ గడువు ముగిసినందున రెండవ వేతన సవరణ కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలల్లో స్వచ్ఛ కార్మికులను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూఎస్పీసీ రాష్ట్ర బాధ్యులు సుధీర్, అంజన్ బాబు, యూఎస్పీసీ మంచిర్యాల జిల్లా బాధ్యులు గోళ్ళ రామన్న, ఆసంపల్లి రమేష్, లక్ష్మణ్, గుర్రాల రాజ వేణు, మోతె జయకృష్ణ, కుమార్, చంద్రమౌళి, కిరణ్, చక్రపాణి, నర్సయ్య, రాములు, యాకూబ్ పాల్గొన్నారు.

రేపటి ధర్నాను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విదానాలను నిరసిస్తూ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్‌తో ఈ నెల 29న ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ పిలుపులో భాగంగా ఇందిరాపార్క్ వద్ద నిర్వహించ తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండి చాంద్ పాషా కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో ధర్నా పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ము కాస్తూ కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసిందన్నారు. దీనితో రానున్న రోజుల్లో కార్మికులు మరింత శ్రమ దోపిడీకి గురి కానున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలోని 40 కోట్ల మంది అసంఘటిత కార్మికులను కార్పొరేట్ల కాళ్ల కింద బానిసల్ల మార్చి వేశాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండానే మరోసారి ఎన్నికలకు వెళుతుందన్నారు. ధర్నాకు పెద్ద ఎత్తున కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పోషం, శ్రీనివాస్, కుమార్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి తిరుపతి, నాయకులు జాడి విలాస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దశాబ్ది వనం లక్ష్యం పూర్తి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్

నవతెలంగాణ-కాగజ్‌నగర్



దశాబ్దివనంలో భాగంగా జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. స్వాతంత్ర్య భారత వజ్రోత్సవాలలో భాగంగా శనివారం కాగజ్‌నగర్‌లోని ఆదర్శనగర్ పల్లె ప్రకృతి వనంలో ఆయన ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి మొక్కలు నాటారు. అదేవిధంగా మండలంలోని వంజిరి పంచాయతీ పరిధిలో కూడా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు కేటాయించిన లక్ష్యానికి మించి నర్సరీలో మొక్కలు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీడీ్ప వైస్ ఛైర్మన్ కోనేరు కృష్ణారావు, మున్సిపల్ ఛైర్మన్ సద్దాం హుస్సేన్, మున్సిపల్ కమిషనర్ అంజయ్యతో పాటు పాలకవర్గ సభ్యులు, ఐకేపీ మహిళలు పాల్గొన్నారు.

జన్నారం : పర్యావరణ పరిరక్షణ మొక్కలతోనే సాధ్యమని ఎంపీపీ మాదాడి సరోజన, ఎంపీఓ అరుణ రాణి అన్నారు. శనివారం మండలంలోని పోన్కల్, తిమ్మాపూర్ గ్రామాల్లో కోటి వృక్షోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు జాడి గంగాధర్, పోన్కల్ గ్రామ సర్పంచ్ జక్కు భూమేష్ పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్ : నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ అన్నారు. శనివారం క్యాతనపల్లి మున్సిపాలిటీలోని తెలంగాణ క్రీడా ప్రాంగణం ఖాళీ స్థలంలో కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ సిబ్బందితో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ జంగం కళ,వైస్ ఛైర్ పర్సన్ సాగర్ రెడ్డి,కార్యాలయ సిబ్బంది మెప్మా రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

మందమర్రి : స్వతంత్ర భారత్ వజ్రోత్సవాల్లో భాగంగా ఒక రోజు-ఒక కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా శనివారం మందమర్రి వెంకటేశ్వర ఆలయం ప్రాంతంలోని నూతనంగా నిర్మించబడుతున్న వైకుంఠధామంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జడ్పీ సీఈఓ కె.నరేందర్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ శ్యాంసుందర్, హెల్త్ అసిస్టెంట్ సమీర్ పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : పల్లె ప్రకృతి, పాఠశాల ఆవరణలో హరితహారంలో భాగంగా విద్యార్థులతో కలిసి ఎంపీపీ డుబ్బులు నానయ్య జడ్పీటీసీ డుబ్బుల శ్రీదేవి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు డుబ్బుల వెంకన్న, ఏపీఎం తిరుపతి పాల్గొన్నారు.

తాండూర్ : కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో ఎంపీపీ ప్రణయ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీఓ ఆఫీస్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో, ఎంపీడీఓ వి.ప్రవీణ్ కుమార్, ఎంపీఓ సత్యనారాయణ, సూపరింటెండెంట్ వేణుగోపాల్, ఏపీఓ నందకుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు రమేష్, లక్ష్మి పాల్గొన్నారు

వాంకిడి : మండలకేంద్రంలోని ప్రభుత్వ కళాశాల ఆవరణలో స్వాతంత్ర్య భారత వజ్రోత్సవాల్లో భాగంగా శనివారం ఎంపీపీ ముండె విమలాబాయితో పాటు ప్రజా ప్రతినిధులు, నాయకులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ తుకారాం, సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్, ఉప సర్పంచ్ సాయి, ఎంపీఓ శివకుమార్, ఏపీఎం మహేష్ పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : హరితహారం కార్యక్రమంలో భాగంగా కోటి వృక్షాత్సవ కార్యక్రమంలో భాగంగా సిర్పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని శ్మశానవాటిక వద్ద సర్పంచ్ తఫీమా పర్వీన్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్ రాజేశ్వర్, ఎస్సై దీకొండ రమేష్, ఎఫ్ఆర్ఓ పూర్ణచందర్, డిప్యూటీ ఎఫ్ఆర్ఓ ముసవీర్ పాల్గొన్నారు.

దహెగాం : మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవడం అందరి బాధ్యతని ఎంపీపీ కంబగోని సులోచన అన్నారు. వజ్రోత్సవాల కార్యక్రమంలో భాగంగా మండలంలోని గెర్రె గ్రామంలో మొక్కలు నాటారు. అలాగే బీబ్రా గ్రామంలో స్థానిక సర్పంచ్ బండ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎంపీడీఓ రాజేశ్వర్‌గౌడ్, డిప్యూటీ రేంజర్ శ్రీధరాచారి, సెక్షన్ ఆఫీసర్ సతీష్ పాల్గొన్నారు.







కేజీబీవీలలో కేర్‌టేకర్లను నియమించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కస్తూర్బా గాంధీ విద్యాలయాలలో కేర్‌టేకర్లను నియమించాలని పీఆర్‌టీయుటీఎస్ జిల్లా అధ్యక్షులు ఎటుకూరి శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. శనివారం కాగజ్‌నగర్ కేజీబీవీలో సభ్యత్వ నమోదు చేపట్టగా దీనికి హాజరైన శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ కేజీబీవీలలో పని చేసే బోధన, బోధనేతర సిబ్బందికి బేసిక్‌పే అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీనికి ముందు సంఘం రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షులు పర్శ చంద్రశేఖర్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎనగంటి భిక్షపతి, పత్తిపాక శ్రావణ్‌కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి రమాదేవి, సీఆర్‌టీలు జ్యోతి, రాణి, నిర్మల, రజిత, స్వాతి, విజయలక్ష్మి, పీజీసీఆర్‌టీలు పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత వివిధ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చి సీఎం విస్మరించారని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏట్కూరి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జాడి దేవాజీ, ప్రధాన కార్యదర్శి పురుషోత్తం, పాఠశాల ప్రత్యేక అధికారిని నాగసుధ, సమగ్ర శిక్ష సిర్పూర్ మండల అధ్యక్షురాలు సుజాత, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, అధికార ప్రతినిధి సామాల ప్రకాష్, రమేష్, పవన్ పాల్గొన్నారు.



పర్యవేక్షణ లేకనే ఉపాధి పనుల్లో అవకతవకలు

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- సీఐటీయూ మండల కన్వీనర్ కుటికెల ఆనంద్ రావు



నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో శనివారం ఏర్పాటుచేసిన సామాజిక తనఖీలో మండల వ్యాప్తంగా దాదాపు రూ.కోటి అవకతవకలు జరిగినట్లు తేలింది. ఉపాధి హామీ పనులలో పర్యవేక్షించాల్సినటువంటి ఎంపీడీఓ, ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్లు, బాధ్యతరహితంగా వ్యవహరించడం వల్ల అవకతవకలు జరిగినట్లు ఆరోపించారు. ఉపాధి కూలీలు వారికి కేటాయించిన వర్క్ ఐడి ప్రకారం పనులు చేస్తున్న ప్రదేశాన్ని సందర్శించి కొలతలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ అందుకు విరుద్ధంగా కార్యాలయంలోనే ఉంటూ కొలతలు చేపట్టినట్లు రికార్డులు సృష్టించి అవినీతికి కారకులు అయినటువంటి ఈజీఎస్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులలో మండలంలోని వివిధ గ్రామపంచాయతీలలో రూ.20 లక్షల మేరకు అవకతవకలు జరిగినట్లు సామాజిక తనిఖీ బృందం ప్రజావేదిక దృష్టికి తీసుకుని వెళ్లినప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డూరమన్నారు. కెరమెరి జీపీలో సుమారు రూ.67 లక్షల వరకు అవకతవకలు జరిగినట్లు సామాజిక బృందం సభ్యులు తేల్చినప్పటికీ సంబంధిత అధికారులపైన ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. మండలంలో దాదాపు రూ.90 నుండి రూ.1 కోటి మేరకు ఉపాధి పనుల్లో అక్రమాలు చోటు చేసుకున్నప్పటికీ ఉన్నత అధికారులు సంబంధిత అధికారులపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు కారకమైనటువంటి ఎంపీడీఓ, ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్ ఈసీలపైన శాఖా పరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ను ముట్టడిస్తామని హెచ్చరించారు. దీనిలో శ్యాంరావు, సంతోష్, నగోరావు భీము, గణపతి పాల్గొన్నారు

బాల సభలతో విద్యార్థుల ఆత్మవిశ్వాసం

నవతెలంగాణ-భీమారం



బాల సభలతో విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెంపొందుతోందని తహసీల్దార్ విశ్వంబర్ అన్నారు. ప్రతీ నాలుగో శనివారంలో బాగంగా మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన బాలసభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిదులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలసభ కార్యక్రమం ద్వారా వివిధ సన్ని వేశాలపై విద్యార్థులు గళం విప్పారు. దీంతో సమాజంలో జరుగుతున్న బాల్య వివాహలతో జరిగే అనర్థాలు, బాలల హక్కులపై సమాజ పాత్రను, విద్యార్థులు తమ లక్ష్యా శిఖరాలను అదిరోహించేందుకు తల్లిదండ్రుల పాత్ర వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం తహసీల్దార్‌ను ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరెందుల శ్రీనివాస్, ఇంఫాక్ట్ ఫౌండేషన్ సభ్యులు, చెన్నూర్ డివిజన్ గ్రామీణ ఉపాధి పథకం ఏపీడీ సురేష్ పాల్గొన్నారు.

రాజకీయ జోక్యంతో బకాయిలు ఇప్పించాలి



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

రాజకీయ జోక్యంతో సంస్థ బాకాయిలు ఎందుకు ఇప్పించలేకపోతున్నారని సింగరేణి యాజమాన్యాన్ని, ప్రభుత్వాన్ని జేఏసీ నాయకులు ప్రశ్నించారు. శనివారం ఆర్కే ఓసీపీలో జేఏసీ ఆధ్వర్యంలో కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు మాట్లాడుతూ సింగరేణిలో మితిమీరిన రాజకీయ జోక్యం పెరిగినందువల్లే నిజాయితీగా పనిచేసే అధికారులకు బదిలీలు చేపిస్తున్నారని అన్నారు. సంస్థకు రావాల్సిన బకాయిలు ఇవ్వకుండా జీతాల కోసం బ్యాంకుల చుట్టూ తిరిగే పరిస్థితికి తీసుకువచ్చారని ఆవేదన వ్యక్తంచేశారు. ఏరియాలో అనేక సమస్యలు ఉన్నప్పటికీ కేవలం తమకు అనుకూలమైన పైరవీలు చేసుకుంటూ సమస్యలను పట్టించుకోవడంలేదని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం హయాంలో మున్సిపాలిటీను ఏర్పాటు చేసిన దాని పరిధిలోని కార్మికులకు ఇంటి కిరాయి ఇప్పించలేని స్థితిలో ఉన్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఏ.ఆంజనేయులు పి.రమేష్, పి.శ్రీనివాస్ ఐఎన్టీయూసీ నాయకులు రాంబాబు, దేవి భూమయ్య, హెచ్ఎంఎస్ నాయకులు పార్వతి రాజిరెడ్డి, సీఐటీయూ నాయకులు సాంబార్ వెంకటస్వామి, అలవాల సంజీవ్, బీఎంఎస్ ఉరుకొండ తిరుపతి పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలని రెండవ ఏఎన్ఎంల భిక్షాటన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బేషరతుగా తమ సర్వీస్ రెగ్యులర్ చేయాలని డిమాండ్‌తో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా రెండవ ఏఎన్ఎంలు పట్టణంలో భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ రెండో ఏఎన్ఎంల కడుపుకోత ప్రభుత్వం అర్థం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ నిర్వహించాలనే డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. రెండవ ఏఎన్ఎంలు చాలీచాలని వేతనాలు తీసుకుంటూ ప్రజల ఆరోగ్యాలు కాపాడడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నోటిఫికేషన్ రద్దుచేసి రెగ్యులర్ చేయాలని లేని పక్షంలో ఈ సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు టి.దివాకర్ ఉపాధ్యక్షులు దుర్గం రవీందర్, ఏఎన్ఎంల యూనియన్ రాష్ట్ర నాయకురాలు వసంత, జిల్లా అధ్యక్షురాలు సంతోషి, ప్రధాన కార్యదర్శి పుణ్యావతి, ఉపాధ్యక్షులు రజిని, భాగ్య, ప్రచార కార్యదర్శులు భూదేవి, ప్రమీల కోశాధికారి సునీత, నాయకులు తిరుమల, సునీత, రాజేశ్వరి పాల్గొన్నారు.

గుడిపేట్‌లో కలెక్టర్ బిజీబిజీ



నవతెలంగాణ-హాజీపూర్

మండలంలోని గుడిపేట్‌లో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ శనివారం బిజీ బిజీ గా గడిపారు. 13వ బెటాలియన్‌లో ఇన్‌ఛార్జి కమాండెంట్ రఘునాథ్ చౌహాన్, డీసీపీ రాంనాథ్ కేకైన, డీఆర్డీవో శేషాద్రితో కలిసి తెలంగాణ కు హరితహారం కార్యక్రమంలో బాగంగా మొక్కలు నాటారు. అనంతరం నూతనంగా నిర్మించిన గుడిపేట్ గ్రామ పంచాయతీ భవనాన్ని సందర్శించారు. నంనూర్, గుడిపేట్ జీపీలలో ఏర్పాటు చేసిన ఓటరు అవగాహన ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ 18 ఏండ్ల వయస్సు నిండిన యువతీ, యువకులు ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 26,27 తేదీల్లో సెప్టెంబర్ నెలలో 2,3 తేదీల్లో ప్రతి గ్రామంలోని అన్ని పోలింగ్ స్టేషన్‌లలో ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. దీని ద్వారా ఓటు హక్కు నమోదుతో పాటు, ఓటు బదిలీ, ఇతర మార్పులు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం

నవతెలంగాణ-కెరమెరి



ఆదిలాబాద్ నుంచి కాగజ్‌నగర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు మండలంలోని ఘాట్ రోడ్డు వద్ద త్రుటిలో ప్రమాదం తప్పింది. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాద్ నుంచి కాగజ్‌నగర్ వస్తున్న క్రమంలో డ్రైవర్‌కు మిత్రుడైన వ్యక్తి బ్యానెట్ మీద కూర్చున్నాడు. ఆయనతో మాట్లాడుకుంటూ ఘాటు రోడ్డు దించే క్రమంలో అప్పటికే రెండుసార్లు బస్సు మూల మలుపుల వద్ద అదుపు తప్పింది. మూడోసారి చెట్టును ఢీ కొట్టి బస్సు నిలిచిపోయింది. దీంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకుండా ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఓ టేకు చెట్టును ఆనుకోవాడంతో బస్సు లోయలో పడిపోకుండా నిలిచిపోవడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. ఘాటు రోడ్డులో ఇరుకైన రోడ్డు ఉండడం బస్సు రోడ్డు దిగితే మళ్ళీ ఎక్కలేని పరిస్థితి ఉండడంతో తరచూ ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని వెంటనే అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు వెడల్పు పనులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఇదే విషయంపై డిపో మేనేజర్ శ్రీధర్‌ను అడగగా డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పిందని తెలిపారు. రోడ్డు ఇరుకుగా ఉండడం వర్షం పడ్డప్పుడు బస్సు టైర్లు జారుతుండడంతో తరచు ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. సంఘటన స్థలం వద్దకు వెళ్లి విచారణ జరిపినట్లు తెలిపారు.

నవతెలంగాణ - బెజ్జూర్

క్షణికావేశం నెల రోజుల్లోనే మండలంలో రెండు నిండు ప్రాణాలను బలిగొంది. మద్యం తాగిన మైకంలో విచక్షణ కోల్పోయి హత్యలకు పాల్పడుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఏడు సంవత్సరాల నుండి ఎలాంటి హత్యలు జరగని మండలంలో నెల రోజుల వ్యవధిలోనే రెండు హత్యలు జరగడం కలకలం రేపింది. నెల క్రితం బెజ్జూర్‌కు చెందిన గట్టు చంద్రకళను ఆస్తి కోసం వరుసకు కొడుకు అయిన తిరుపతిగౌడ్ హత్య చేశాడు. శుక్రవారం రాత్రి కాటపెల్లి గ్రామానికి చెందిన మెరుగు తిరుపతిని తమ్ముడు క్షణికావేశంలో గొడ్డలితో నరికి హతమార్చాడు. తల్లిని కొట్టాడనే నెపంతో మెరుగు తిరుపతిని తమ్ముడు మెరుగు దేవాజీ హత్య చేశాడు. సంఘటన స్థలాన్ని సీఐ సాదిక్‌పాషా, ఎస్ఐ విక్రమ్ సందర్శించి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
4
ఆదివారం 27 ఆగస్టు 2023

ఎమ్మెల్యే టికెట్‌కు సాయిచరణ్‌గౌడ్ దరఖాస్తు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రానున్న ఎన్నికల్లో ఆదిలాబాద్ నియోజకవర్గ నుండి యువజన కాంగ్రెస్ కోటాలో ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి అవకాశం ఇవ్వాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్‌గౌడ్ అన్నారు. శనివారం జిల్లా నాయకులతో కలిసి గాంధీ భవన్‌లో దరఖాస్తు అందజేశారు. బహుజన, గౌడ సామాజిక బిడ్డగా 2012 నుండి ఎన్ఎస్‌యూఐ ఉద్యమాల్లో, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న తనకు అవకాశం కల్పించాలని కోరారు.



పండుగగా కోటి వృక్షోత్సవ వేడుక

పలుచోట్ల మొక్కలు నాటిన ప్రముఖులు


ఆసిఫాబాద్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలో భాగంగా ఒకేరోజు రాష్ట్రవ్యాప్తంగా కోటి మొక్కలు నాటాలని నిర్ణయించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపుమేరకు జిల్లాలో కోటి వృక్షోత్సవ వేడుక కన్నుల పండుగగా కొనసాగింది. జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల ఆవరణలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో కలెక్టర్ బోర్కడ హేమంత్ ప్రముఖులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని, వాటిని బతికేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్, ఎస్పీ సురేష్‌కుమార్, ఏఎస్పీ అచ్చేశ్వరరావు, డిఎస్పి శ్రీనివాస్, డిపిఓ సురేందర్, డిటిడిఓ రమాదేవి, ఎంపీపీ మల్లికార్జున్, ఎండిఓ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

సారంగాపూర్: మండలంలోని మహబూబ్‌ఘాట్ అటవీ ప్రాంతంలో కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో శనివారం కలెక్టర్ వరుణ్‌రెడ్డి మొక్కలు నాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఐదెకరాల్లో 2000 మొక్కలు నాటారు. ఎస్పీ ప్రవీణ్ కుమార్, డీఆర్డిఓ విజయలక్ష్మి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, రైతుబంధు అధ్యక్షులు వెంకట్ రామ్‌రెడ్డి, అడెల్లి ఛైర్మెన్ చందు, ఎఎంసి ఛైర్మన్ ఆశ్రిత శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిడిఓ సరోజ, ఏపిఓ లక్ష్మారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నిర్మల్ : కోటి వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం పురపాలక సంఘం డంపింగ్ యార్డ్‌లో అదనపు కలెక్టర్ యల్.కిషోర్ కుమార్, మున్సిపల్ ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్ మొక్కలు నాటారు. పండుగ వాతావరణంలో కౌన్సిల్ సభ్యులు, పురపాలక సంఘం కార్యాలయ సిబ్బంది, మొక్కలు నాటారు. కార్యక్రమంలో కమిషనర్ సివిఎన్ రాజు, ఏఈ హరిభవన్, సానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు దేవిదాస్, మురారి, కౌన్సిలర్లు బిట్లింగ్ నవీన్, గండ్రత్ రమణ, అదుముళ్ల పద్మాకర్, ఎడిపెల్లి నరేందర్, భూపతి ఉన్నారు.


రెబ్బెన

రెబ్బెన : మండలంలో కోటి వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని పల్లె ప్రకృతివనంలో మొక్కలు నాటారు. ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, సీఐ అల్లం నరేందర్, సర్పంచ్ బొమ్మినేని అహల్యాదేవి, ఎంపీటీసీ మధునయ్య, ఎంపీఓ అమ్జత్‌పాషా, ఏపీఎం రాజ్‌కుమార్, ఏపీఓ బుచ్చన్న, కోఆప్షన్ సభ్యుడు జహీరొద్దీన్, సెక్రటరీ రవీందర్, అంగన్‌వాడీ టీచర్లు, వార్డుమెంబర్‌లు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.


సారంగాపూర్

జైపూర్ : ఖాళీ స్థలం ఎక్కడ కన్పించినా విధిగా చెట్టు నాటుకోవాలని ఎంపీపీ గోదారి రమాదేవి లక్ష్మణ్ అన్నారు. శనివారం ఎంపీడీఓ సత్యనారాయణతో కలిసి కానుకూరులో చెట్లు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవాళి మనుగడతో ముడిపడి ఉన్న చెట్లను నాటి సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరూ గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వర్‌గౌడ్, ఏపీఓ బాలయ్య, పంచాయతీ కార్యదర్శి సురేంద్ర, టీఏ శిరీష్, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కౌటాల : హరిత తెలంగాణగా తీర్చిదిద్దాలని డీసీఎంఎస్ వైస్ ఛైర్మన్ కుమురం మాంతయ్య అన్నారు. కోటి మొక్కలు నాటడడంలో భాగంగా శనివారం పోలీస్‌స్టేషన్‌లో సర్పంచ్‌లు, అధికారులు, నాయకులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇంటికి నాలుగు మొక్కలు నాటి కాలుష్య నివారణకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వొజ్జెల మౌనీష్, ఎస్ఐ మధుకర్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


జైపూర్

బెజ్జూర్ : జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో శనివారం హరితహారం కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ రోజా రమణి, జెడ్పీటీసీ పుష్పలత మొక్కలు నాటారు. అనంతరం శ్మశాన వాటిక వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ ఓంప్రకాష్, ఎఫ్ఆర్ఓ దయాకర్, ఎంపీడీఓ మాధవి, ఎంపీఓ రమేష్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు బశరత్‌ఖాన్, బీఆర్ఎస్ నాయకులు వెంకన్న, నరేందర్‌గౌడ్, జావిద్ అలీ, పుల్లూరి సతీష్, జావేద్ హుస్సేన్, మహేష్, ఏపీఓ చంద్రయ్య, స్థానిక సర్పంచ్ అన్సర్‌హుస్సేన్, బీట్ అధికారి అనిత, గ్రామ పంచాయతీ కార్యదర్శి తుకారాం, ఫీల్డ్ అసిస్టెంట్ రవి పాల్గొన్నారు.

కేజీబీవీ, యూఆర్ఎస్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలి : టీఎస్‌యూటీఎఫ్



నవతెలంగాణ-జైనథ్

కేజీబీవీ, యూఆర్ఎస్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని: టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.అశోక్ అన్నారు. శనివారం సభ్యత్వ నమోదు క్యాంపెయిన్‌లో భాగంగా మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించారు. ఉపాధ్యాయుల సమస్యలపై మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను, సోషల్ వెల్ఫేర్ గురుకులాల్లో పనిచేస్తున్న సీఆర్టీలను రెగ్యులర్ చేయడాన్ని తాము స్వాగతిస్తున్నామని అన్నారు. అయితే గత 15 సంవత్సరాలుగా ఎంతో శ్రమకోర్చి అద్భుత ఫలితాలను సాధిస్తున్న కేజీబీవీ, యూఆర్ఎస్ సిబ్బందిని క్రమబద్ధీకరించడం కుదరదంటూ ప్రకటించడం సరికాదన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక కాంట్రాక్టు ఉద్యోగులంటూ ఉండబోరని స్వయంగా సీఎం ప్రకటించారని గుర్తుచేశారు. నేడు అందుకు భిన్నంగా మంత్రి వ్యాఖ్యలు ఉండటం విచారకరమన్నారు. ఇప్పటికైనా కేజీబీవీ, యూఆర్ఎస్ సిబ్బందికి బేసిక్ పే ఇవ్వాలని, క్రమంగా వారిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు టి.సూర్యకుమార్, మండల ప్రధాన కార్యదర్శి ఎన్. గణేష్, కోశాధికారి ఎస్.నాందేవ్, మండల బాధ్యులు ఆర్.నారాయణ, ఎస్.గోపాల్, ఎస్ నర్సింలు, ఏ.మహదేవ్ పాల్గొన్నారు.

భావితరాల మనుగడకు మొక్కలు నాటాలి



నవతెలంగాణ-జైనథ్

భావితరాల మనుగడకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శనివారం మండలంలోని మాంగుర్ల గ్రామ ప్రజలతో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంరక్షణలో బాధ్యతగా మొక్కలు వాటి ప్రాధాన్యతను గుర్తించించి, రాష్ట్ర ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు. ఇలాంటి బృహత్తర కార్యక్రమాన్ని సీఎం కేసీఆర్ సంకల్ప కార్యసిద్ధితో విజయవంతం చేయడం జరుగుతుందని అన్నారు. హరితహారం 10 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం జరుగుతుందని అన్నారు. దీనివలన రాష్ట్ర అటవీ సంపద రెండు నుంచి మూడు శాతం పెరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోవర్ధన్, ఉప సర్పంచ్ పోచ్చన్న, ఎంపీడీఓ గజానన్ పాల్గొన్నారు.

తలమడుగు : నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఎంపీపీ కళ్యాణం లక్ష్మీ అన్నారు. శనివారం హరితహారంలో భాగంగా మండలంలో ప్రభుత్వ ప్రయివేటు స్థలాల్లో మొక్కలు నాటారు. కుచులాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపీపీ మొక్కలు నాటారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. పర్యావరణాన్ని కాపాడినట్లయితే, మనిషి జీవన విధానం కాపాడుకో గలుగుతామని అన్నారు. అంతరించిపోతున్న అటవీ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమాకాంత్, ఎంపీఓ దిలీప్ కుమార్, మండల కాంగ్రెస్ కన్వీనర్ రాజేశ్వర్, ఉపసర్పంచ్ కిషన్, దేవరావు, ప్రధానోపాధ్యాయులు వినోద్‌రెడ్డి, రాజశేఖర్, విద్యార్థులు పాల్గొని మొక్కలు నాటారు.

ఒంటికాలిపై నిల్చొని రెండో ఏఎన్ఎంల నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తమను రెగ్యులర్ చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యూనైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో రెండో ఏఎన్ఎంలు చేపడుతున్న సమ్మె శనివారం నాటి 12వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా శిబిరం వద్ద రెండో ఏఎన్ఎంలు ఒంటికాలిపై నిల్చొని వినూత్నరీతిలో నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంపీహెచ్ఏ(ఎఫ్) పోస్టుల భర్తీ కోసం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని అన్నారు. 1520 పోస్టుల భర్తీకి పరీక్ష నిర్వహించి, సెలక్ట్ చేయబోతోందన్నారు. దీంతో కాంట్రాక్టు ఉద్యోగులు కూడా పరీక్ష రాయాల్సి వస్తోందని, మెరిట్ వస్తేనే సెలక్ట్ అయ్యే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. సర్వీసుకు 20 మార్కులు వెయిటేజి ఇచ్చినా ప్రయోజనం ఉండదన్నారు. ఇప్పటికైనా స్పందించి రెగ్యులర్ చేస్తూ తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

అందరూ బాధ్యతగా మొక్కలు నాటాలి

- జెడ్పీ ఛైర్మెన్ రాథోడ్ జనార్ధన్

నవతెలంగాణ-ఉట్నూర్

సమస్త జీవకోటి మనుగడకు చెట్లు ఎంతో అవసరమని అందుకు విధిగా అందరూ మొక్కలను నాటాలని జెడ్పీ ఛైర్మెన్ రాథోడ్ జనార్ధన్ అన్నారు. శనివారం స్థానిక కేబీ ప్రాంగణంలో బాలికల గురుకుల జూనియర్ కళాశాల ఆవరణలో హరితహారంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఛైర్మెన్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని అన్నారు. మొక్కలు నాటి కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని అన్నారు. మొక్కలు పెంచడం ద్వారా మంచి ఆక్సిజన్ లభిస్తుందని, మొక్కలు నాటడం వల్ల అడవి పెరుగుతుందన్నారు. అనంతరం ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్ కలిసితో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్వో అనిత, ఎంపీడీఓ తిరుమల, నాయకులు, విద్యార్థులు ఉన్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి

- అధికారుల గైర్హాజరుపై అసహనం



నవతెలంగాణ - బెజ్జూర్

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ రోజా రమణి అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రోజా రమణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ మండల అభివృద్ధికి అందరు సహకరించాలని కోరారు. సమావేశానికి అధికారులు గైర్హాజరు కావడం పట్ల సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. వచ్చే సమావేశాలకైనా అధికారులు హాజరయ్యేటట్లు చూడాలని ఎంపీడీఓను కోరారు. మండలంలోని ఏటిగూడ, పాపన్‌పేట, గబ్బాయి, పెద్ద సిద్దాపూర్ గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు అధికారులు ధృవీకరించడంలేదని పీఏసీఎస్ ఛైర్మన్ ఓంప్రకాష్, బెజ్జూర్ సర్పంచ్ అన్సర్ హుస్సేన్ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఇన్‌చార్జి తహసీల్దార్ బ్రహ్మేశ్వర్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ గ్రామాల్లో గృహలక్ష్మి దరఖాస్తులపై ధృవీకరించడంలేదని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ప్రభుత్వం నుండి అనుమతి రాగానే ధృవీకరిస్తామని తెలిపారు. మండలంలోని బెజ్జూర్, రెబ్బెన, కర్జెల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఉన్నాయని, ఎలాంటి సమస్యలున్నా దృష్టికి తీసుకురావాలని విద్యుత్ శాఖ ఏఈ అంజల్‌కుమార్ తెలిపారు. సబ్ ఇంజనీర్లు గ్రామాలను దత్తత తీసుకొని సమస్యలు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారుల కేంద్రంలో వచ్చిన సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. కృష్ణపెల్లి గ్రామంలో విద్యుత్ పాత స్తంభాలను తీసికొని కొత్త స్తంభాలను వేయించినట్లు తెలిపారు. అనంతరం ఫారెస్ట్ రేంజ్ అధికారి దయాకర్ మాట్లాడుతూ మండలంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా ఒక లక్ష 20 వేల మొక్కలు నాటినట్లు తెలిపారు. అడవులు క్షీణించడంపై 30 ఎకరాల్లో ప్లాంటేషన్ పూర్తిచేసినట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం తునికాకు రాయల్టీ చెల్లించడం జరిగిందని, 2017 నుండి 2022 వరకు రాయల్టీ డబ్బులు చెల్లించినట్లు తెలిపారు. కూలీలు ఎవరైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. బెజ్జూర్ ప్రాంతంలో పులి తిరుగుతోందని, రైతులు అటవీ ప్రాంతాల్లోకి జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు. ఏపీఓ చంద్రయ్య మాట్లాడుతూ మండలంలో వంద ఎకరాల్లో ఆర్టికల్చర్ కింద ఎసీసీ, ఎస్టీ గిరిజనులు పెండ్ల చెట్లు నాటడం జరుగుతుందన్నారు. ఐదెకరాలలోపు ఉన్న సన్నకారు గిరిజన రైతులు వంద శాతం సబ్సిడీ కింద జామ, మామిడి, నిమ్మ, దానిమ్మ, బత్తాయి, నేరేడు చెట్లు పెంచుకొని తద్వారా రైతులు లబ్ధి పొందాలన్నారు. కడంబా రూట్‌లో బెజ్జూర్‌కు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని సర్పంచ్ అన్సర్ కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ పుష్పలత, పీఏసీఎస్ ఛైర్మన్ ఓంప్రకాష్, ఎంపీడీఓ మాధవి, ఎఫ్ఆర్ఓ దయాకర్, ఇన్‌చార్జి తహసీల్దార్ బ్రహ్మేశ్వర్, ఎంపీఓ రమేష్‌రెడ్డి, ఎంఈఓ రమేష్‌బాబు, ఏపీఓ చంద్రయ్య, ఏఈలు అంజన్‌కుమార్, మక్బుల్ హుస్సేన్, అభిలాష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కరుణ, ఏఈఓ మారుతి, ఆర్టీసీ సిబ్బంది లక్ష్మణ్, మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

- జైపూర్ ఏసీపీ మోహన్



నవతెలంగాణ-జైపూర్

సైబర్ నేరాల పట్ల విదార్థులు అప్రమత్తంగా ఉండాలని జైపూర్ ఏసీపీ మోహన్ సూచించారు. శనివారం ఇందారం ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ఉమెన్ సేఫ్టీ, షీటీమ్స్, హక్ ఐ, అభయా యాప్‌ల ఉపయోగంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సెల్ ఫోన్‌కు దూరంగా విద్యకు దగ్గరగా ఉండి లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ చెప్పాలని అడిగితే ఎట్టి పరిస్థితుల్లోను చెప్పకూడదని హెచ్చరించారు. యూపీఐ పేమెంట్ విషయంలో జాగ్రత్తలు పాటించాలని, ఆర్థిక పరమైన సైబర్ నేరాలు జరిగిన సమయంలో హెల్ప్ లైన్ నెంబర్ 1930కు కాల్ చేయాలని తెలిపారు. ఈ విషయమై కుంటుబ సభ్యులకు, బంధువులకు, పరిసర కుటుంబాలకు తెలియజేయాలని సూచించారు. వాహనాలు నడుపుతున్నప్పుడు విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపొద్దని తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులకు పాఠశాల విద్యార్థినులు రాఖీలు కట్టారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ సీఐ రమేష్ బాబు, మంచిర్యాల ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నరేష్ కుమార్, జైపూర్ ఎస్సై ఉపేందర్, శ్రీరాంపూర్ ఎస్సై రాజేష్, భీమారం ఎస్సై రాజవర్ధన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నస్పూర్ : పోలీసుల ఆధ్వర్యంలో జడ్పీ హెచ్ఎస్ తీగలపహాడ్‌లో విద్యార్థులకు మంచిర్యాల రూరల్ సిఐ సంజీవ్ ఆధ్వర్యంలో సైబర్ మోసాలు, మహిళల భద్రత, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళలు, ఆడపిల్లల రక్షణ కోసం ప్రభుత్వం అమలు చేసిన చట్టాలను తెలుసుకొని ఉపయోగించుకోవాలన్నారు. బాలికలకు బాల్య వివాహాలు చేసి, బాధ్యత తీరిందని తల్లిదండ్రులు అనాలోచితంగా నిర్ణయాలు తీసుకోవద్దన్నారు. బ్యాంక్ లావాదేవీలను ఆసరాగా చేసుకుని మోసగాళ్లు నేరాలు చేస్తూ సామాన్య ప్రజలను దోచుకుంటున్నారని, తల్లిదండ్రులకు విద్యార్థులు అవగాహన కల్పించి అరికట్టాలని సూచించారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్, కారు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ ధరించే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో నస్పూర్ ఎస్ఐలు రవికుమార్, సంతోష్, పోలీస్, సైబర్ క్రైమ్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోలింగ్ బూత్‌ల సందర్శన

తాండూర్ : మండలంలోని అచులాపూర్, గోపాల్‌నగర్, తాండూర్ పరిధిలోని 121, 130, 139, 147, 19 పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ రోహిత్ సందర్శించారు. బూత్ స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. కొత్త ఓటర్ల నమోదు, తొలగింపు, చేర్పులు మార్పులు చేయడంలో బూత్ స్థాయి అధికారులు జాగ్రత్తతో వ్యవరించాలన్నారు. సాయంత్రం వరకు ఓటర్లకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఓటర్ల నమోదు కార్యక్రమంలో ఏ ఒక్క రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరించరాదని తెలిపారు. ఓటర్ల నమోదు ప్రక్రియకు విస్తృత ప్రచారం చేయాలని సూచించారు.

పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపునిస్తాం : అనిల్ జాదవ్



నవతెలంగాణ-బోథ్

నియోజకవర్గంలో బీఆర్ఎస్‌లో పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గౌరవంతో పాటు గుర్తింపు ఉంటుందని బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్. సంధ్యారాణి ప్రసాద్ నివాసంలో ఏర్పాటు చేసిన ప్రథమ శ్రేణి కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు తగిన గౌరం గుర్తింపు ఇస్తామని హామీ ఇచ్చారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కష్టపడాలి సూచించారు. కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

తలమడుగు: మండలంలోని ఖోడద్ గ్రామంలో పోలింగ్ బూత్‌లను అదనపు కలెక్టర్ శ్యామలదేవి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాల పూర్తయిన యువతీ, యువకులు తప్పకుండా తమ ఓటరు నమోదు చేసుకోవాలని కోరారు. అదేవిధంగా ఓటర్ లిస్టులో పేర్లు తప్పులు ఏమైనా ఉన్నట్లయితే వెంటనే బీఎల్ఓ లేదా సంబంధిత శాఖ అధికారుల సంప్రదించాలని అన్నారు. ఈ సందర్భంగా బడి మానివేసిన పిల్లలను బడిలో చేరిపించే విధంగా అందరూ కృషి చేయాలని కోరారు. అదనపు కలెక్టర్ వెంట తహసీల్దార్ రాజమోహన్, సర్పంచ్ ఆనంద్, ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి, బీఎల్ఓలు కళావతి, లక్ష్మి ఉన్నారు.

28న యూపీఎస్సీ కోచింగ్ ప్రవేశ పరీక్ష

ఆదిలాబాద్‌టౌన్: యూపీఎస్సీ సిశ్యాట్ కోచింగ్ ప్రవేశ పరీక్షను ఈ నెల 28న సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు చాందా(టి)లోని మైనారిటీస్ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కృష్ణవేణి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైనార్టీ స్టడీ సర్కిల్, మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కోచింగ్‌కు 100 మంది అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. హైదరాబాద్‌లోని స్టడీ సర్కిల్‌లో తొలిసారి ప్రవేశం పొందే వారంతా పరీక్షకు హాజరు కావాలన్నారు.

నూతన ఉద్యోగులకు సన్మానం

నవతెలంగాణ-తాంసి



మండలంలో బీఆర్ఏలుగా విధులు నిర్వర్తించి, సర్దుబాటులో భాగంగా ఇతర శాఖలకు కేటాయించడంతో వారు ఆయా శాఖల్లో నియామకం అయిన దారవేణి రాఘవేంద్రతో వార్డు ఆఫీసర్‌గా నియమితులైన గుగ్గిళ్ల జీవన్‌ను తాంసి మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో పాలకవర్గ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వప్నరత్న ప్రకాష్, ఉప సర్పంచ్ కాంతారెడ్డి, బీఆర్ఎస్ కన్వీనర్ అరుణ్, వార్డు సభ్యులు లక్ష్మి దేవారెడ్డి, విలాస్, ప్రసాద్, కళ్యాణ్ కార్యదర్శి గంగన్న ఉన్నారు.

18 ఏండ్లు నిండిని వారు ఓటు నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ-జన్నారం



18 ఏండ్లు నిండిని ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని ఉట్నూరు ఆర్డీ జివాకర్‌రెడ్డి, జన్నారం తహసీల్దార్ వనజారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పోన్కల్ గ్రామపంచాయతీలో ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సందర్భంగా ఆ కార్యక్రమని సరళిని పరిశీలించారు. బూతులెవన్ అధికారులు కొత్తగా ఓటరు నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. అనంతరం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు బూతులెవన్ అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం



నవతెలంగాణ-ముధోల్

మహారాష్ట్ర నాయగావ్ ఎమ్మెల్యే రాజేష్ పవార్

రాబోయే తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని మహారాష్ట్ర నాయగావ్ ఎమ్మెల్యే రాజేష్ పవార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ముధోల్‌లో జీఎం గార్డెన్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న అధ్యక్షతన ఏర్పాటు చేసిన అసెంబ్లీ ప్రవాస్ యోజన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు వచ్చిన సమయంలోనే పథకాలను ప్రవేశపెడుతుందని పేర్కొన్నారు. ప్రజలను మభ్యపెట్టే ప్రభుత్వానికి ఎన్నికల్లో ఓడించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పడకంటి రమాదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామారావు పటేల్, మోహన్‌రావు పటేల్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ముత్యంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ సాయినాథ్, కోకన్వీనర్ సుమన్, మాజీ మున్సిపల్ ఛైర్మెన్ గంగాధర్, మాజీ ఎంపీపీ సుభాష్ జాదవ్, ఎంపీటీసీలు దేవోజి భూమేష్, లక్ష్మీనారాయణ, బీజేపీ నాయకులు మోహన్‌రెడ్డి, ఓమేష్, తాటివార్ రమేష్, సపటోళ్ల పోతన్న, విష్ణు, సురేష్, వివిధ గ్రామాలకు చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

అర్హులైన 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శనివారం మండలంలోని రామాయి, న్యూరాంపూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. అనంతరం ఇంటింటికి సర్వే నిర్వహించి కుటుంబంలోని వారి పేర్లను ఓటర్ జాబితాలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వందశాతం ఓటరు నమోదు శాతం పెరిగేలా విస్తృత ప్రచారం చేపట్టాలని, ఇంటింటి సర్వే నిర్వహించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ జాబితాలో వారి పేర్లను చూసుకునేలా గ్రామాల్లో టామ్ టామ్ నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ పట్టణ, రూరల్ మండల తహసీల్దార్లు శ్రీనివాస్, దిలీప్ కుమార్, సూపర్‌వైజర్లు, బీఎల్ఓలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నవతెలంగాణ-కడెం

కడెం జలాశయంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మృతుడు నిన్న కడెం ప్రాజెక్టు కుడి కాలువ తూమ్ వద్ద ఉదయం ప్రాజెక్టులో దూకినట్లు పలువురు గుర్తించినట్లు తెలుస్తుంది. నిన్న సంబంధిత ప్రాంతంలో ఎటువంటి ఆనవాళ్లు దొరకకపోయేసరికి కడెం పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తూ, సంబంధిత కడెం ప్రాజెక్టు వద్ద పోలీసులు తనిఖీలు చేశారు. అయితే శనివారం ఉదయం కడెం ప్రాజెక్టు నీళ్లపై తేలి ఉండటంతో స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించడంతో కడెం ఎస్సై కోసన రాజు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీశారు. ఈ మృతదేహం ఎవరిది ఈ వ్యక్తి ఇక్కడకు ఎందుకు వచ్చినట్లు కోణంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి దాదాపు 45 సంవత్సరాల వయసు ఉండవచ్చునని, మృతుడు వేసుకున్న దుస్తులు నీలిరంగ చొక్కా మీద తెల్లటి చుక్కలు ఉన్నాయి. అలాగే నల్లటి ప్యాంటు ధరించాడు ఎవరికైనా సమాచారం తెలిస్తే తమకు సమాచారం అందించాలని కడెం ఎస్సై కొసన రాజు తెలిపారు.

రెవిన్యూ అధికారులు జాప్యం లేకుండా ప్యాకేజి అందించాలి

నవతెలంగాణ-కాసిపేట

రెవిన్యూ అధికారులు జాప్యం లేకుండా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి, పునరావాసంలో ప్లాట్లు కేటాయించాలని దుబ్బగూడెం గ్రామస్తులు డిమాండ్ చేసారు. శనివారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రెవిన్యూ అధికారులు ప్రకటించిన జాబితాలో అర్హులైన మా పేర్లు లేవని వెంటనే అధికారులు విచారణ చేపట్టి జాబితాలో పేర్లు చేర్చాలని డిమాండ్ చేసారు. ఆరేళ్లుగా అధికారులు ప్యాకేజి, పునరావాసం, విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రకటించిన జాబితా వారికీ ప్యాకేజి, పునరావాసం కల్పిస్తూనే, విచారణ చేపట్టి అర్హులైన వారికీ కూడా ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో వార్డు సభ్యులు గోనెల శ్రీలత, గ్రామ కమిటీ అధ్యక్షుడు గోనెలా శ్రీనివాస్,రమేష్, శ్రీనివాస్, రఫీ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా మహిళా సాధికారిక సంస్థ అధికారులు అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన మహిళ డిగ్రీ కళాశాలలో మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళ సమానత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, చంద్రుని పైకి రోవర్ పంపించిన శాస్త్రజ్ఞుల్లో మహిళలు కూడా ఉన్నారన్నారు. విద్య వైద్యం వాణిజ్య రంగాల్లో ధీరవనితలుగా మహిళలు రాణిస్తున్నారని అన్నారు. మహిళలు వారి కాళ్లపై వారు నిలబడే విధంగా తయారు కావాలని దీనికోసం ఆర్థిక స్వావలంభన సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారిక సంస్థ అధికారులు రాణి, సాగర్, ప్రిన్సిపల్ శారద విద్యార్థులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని మున్సిపల్ ఛైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. జిల్లాకేంద్రంలో నలభై కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఐటీ టవర్ నిర్మాణ పనులను శనివారం ఆయన పర్యవేక్షించారు. టవర్ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, అధికారులకు విస్తృత సూచనలు చేశారు. ఫిబ్రవరి వరకు ఐటీ టవర్ అందుబాటులోకి వచ్చేలా పనులను వేగవంతం చేయాలనీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఛైర్మెన్ మాట్లాడుతూ ఫేజ్ వన్ ఐటీ టవర్ నిర్మాణ పనులు పూర్తయి అందుబాటులోకి వస్తే వెయ్యి మంది యువతకు ఉద్యోగ అవకాశం కల్పించవచ్చని అన్నారు. ఫేజ్ వన్ పూర్తయిన తర్వాత మరో నలభై కోట్ల వ్యయంతో ఫేజ్ టూ ఐటీ టవర్ ను సైతం నిర్మించుకునే అవకాశం ఉందని, అందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ఆదిలాబాద్‌లో ఐటీ కార్యకలాపాల విస్తరణతో పాటు జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల సైతం మంజూరు కావడంతో స్థానికంగానే అత్యుత్తమ సాంకేతిక విద్య అందనుందని వివరించారు. స్థానిక విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా జేఎన్టీయూ కళాశాలలో విద్యనభ్యసించవచ్చని అన్నారు. ఎమ్మెల్యే ప్రత్యేక కృషితో ఆదిలాబాద్ అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షులు అలాల్ అజయ్, కౌన్సిలర్ ఆవుల వెంకన్న, నాయకులు మిషు, సునీల్, ఖలీమ్ పాల్గొన్నారు.

ఏజెన్సీలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

- టీఏజీఎస్ రాష్ట్ర నాయకులు తొడసం శంభు డిమాండ్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఏజెన్సీలో సీజనల్ వ్యాధులతో పల్లెలు విలవిలలాడుతున్నాయని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు తొడసం శంభు అన్నారు. శనివారం ఆయన మండలంలోని వాల్గొండ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఆత్రం గణపతి కుమారుడు ఆత్రం తిరుపతి(27) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మరణించగా, అతని కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి అంత్యక్రియల్లో పాల్గొని, నివాళులర్పించారు. తన ప్రగాఢ సానభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో ఏజెన్సీలో వైరల్ జ్వరాలు, రక్త హీనతతో అనేక మంది బాధపడుతున్నారని అన్నారు. వైద్యశాఖ మేల్కొని గిరి గ్రామాల్లో వైద్యశిబిరం నిర్వహించాలని అన్నారు. అవసరమైతే హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట సర్పంచ్ కినక జుగాదిరావ్, లచ్చి పటేల్, గ్రామస్తులు ఉన్నారు.

సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలి

- యూఎస్పీసీ రాష్ట్ర నాయకుడు లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉద్యోగ ఉపాధ్యాయులకు శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యూఎస్పీసీ, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. సెప్టెంబర్ ఒకటో తేదీన నిర్వహించ తలపెట్టిన ఐక్య ఉపాధ్యాయ సంఘం మహాధర్నా ప్రచారంలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో మాతశ్రీ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సమావేశానికి టిపిటిఎఫ్ రాష్ట్ర నాయకుడు అశోక్, ఎస్సీ ఎస్టీ యూనియన్ నాయకుడు చరణ్ దాస్, డిటిఎఫ్ నాయకుడు శామ్యూల్ బిటిఎఫ్ నాయకుడు సుదీర్ లతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు కోసం ఇప్పటికే మండల, జిల్లా స్థాయి నిరసన కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి ప్రధాన కార్యదర్శి ఇందూ రావు యుఎస్పిసి నాయకులు అంజన్ బాబు, కనక వెంకటేష్, శ్రీనివాస్, విస్తారు, జాడి కేశవ్, దుర్గం తులసి రామ్, మడవి అర్జున్, కంపెల్లి ఉషన్న, హేమంత్, రమేష్, చక్రపాణి, నవీన్, నారాయణ, శ్యామ్ రావు, నాందేవ్ పాల్గొన్నారు.

జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా స్థాయిలో అక్టోబర్ చివరి వారంలో నిర్వహించే జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌కు పాఠశాలల నుండి విద్యార్థులు హాజరయ్యేలా చూసి విజయవంతం చేయాలని జిల్లా విద్యాధికారి అశోక్ తెలిపారు. 31వ జాతీయ బాలల కాంగ్రెస్‌కు సంబంధించి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో శనివారం ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ 10 సంవత్సరాల నుండి 17 సంవత్సరాల మధ్య వయసు కలిగిన బాలబాలికలకు నిర్వహించబడుతుందని అన్నారు. ప్రస్తుత సంవత్సరం బాలల సైన్స్ కాంగ్రెస్ "ఆరోగ్యం, సంక్షేమం కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవడం" అనే ఇతివృత్తం ప్రధాన అంశంగా నిర్వహించబడుతుందన్నారు. బాల బాలికలలో సృజనాత్మకతను నూతన అన్వేషణలను ప్రోత్సహించడం, సామాజికంగా ఎదురయ్యే సమస్యలను గుర్తించి పరిష్కరించుకునే దిశలో ప్రాజెక్టులు చేసేలా ప్రోత్సహించాలని కోరారు. 10 నుండి 14 సంవత్సరాల బాలబాలికలను జూనియర్ గ్రూప్ గాను ,14 సంవత్సరాల పైబడి 17 సంవత్సరాల వరకు గల బాలబాలికలను సీనియర్ గ్రూపుగా నిర్ణయిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి కోఆర్డినేటర్‌గా కటకం మధుకర్, అకాడమిక్ కోఆర్డినేటర్‌గా మామిడాల తిరుపతయ్య, రిసోర్స్ పర్సన్స్‌గా ప్రవీణ్ కుమార్, తవటం శ్యాంసుందర్ పాల్గొన్నారు.

'కాంట్రాక్ట్ కార్మికులను ఓట్లు అడుగొద్దు'

నవతెలంగాణ-నస్పూర్



కాంట్రాక్టు కార్మికులను పట్టించుకోని నాయకులు రానున్న ఎన్నికల్లో ఓట్లు అడగడానికి రావద్దని ఎస్సీకేఎస్(సీఐటీయూ) డివిజన్ కార్యదర్శి గట్టు మహేందర్ అన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల వేతనాలు పెంపుదలపై పోరుబాటలో భాగంగా శ్రీరాంపూర్ డివిజన్ పరిధిలోని ఎస్ఆర్పి ఓసిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులతో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెంబర్ 22ను వెంటనే గెజిట్ చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలోనే అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాలు కడుపు నింపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పక్క రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతుంటే, మరోవైపు కార్మికుల వేతనాల పెంపు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగానే ఉన్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సంపత్, శ్రీను, సమ్మయ్య, అశోక్, తిరుపతి, సంతోష్, శ్రీశైలం పాల్గొన్నారు.

బాల్క సుమన్‌కు ఘన స్వాగతం



నవతెలంగాణ-భీమారం

చెన్నూర్ నియోజకవర్గం నుంచి రెండో సారి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న బాల్క సుమన్‌కు మండలంలో ఘన స్వాగతం లభించింది. రెండవ సారి బీఆర్ఎస్ అభ్యర్థిగా కరారైన సందర్భంగా మొదటి సారి మండలానికి వచ్చిన ఆయనకు పార్టీ శ్రేణులు, ప్రజలు స్వాగతం పలికారు. పార్టీ రాష్ట్ర నాయకులు చెరుకు సరోత్తంరెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఆవుడం క్రాస్ రోడ్డు వద్ద భారీ గజ మాలతో సత్కరించారు. అదేవిధంగా భారీ టాపాసులు పేల్చుతూ డప్పుచప్పుళ్లతో ఆయనకు మండల నాయకులు నిరాజం పలికారు. జాతీయ రహదారి పొడవునా ఇరువైపులా బీఆర్ఎస్ పార్టీ జెండాలు, ఫ్లెక్సీలతో రోడ్డంతా గులాబి మయంగా ప్రజా ఆశిర్వాద ర్యాలీ కొనసాగింది. అనంతరం భీమారం గుండా చెన్నూర్‌కు ర్యాలీగా తరలి వెళ్లారు. ఆయన వెంట పెద్దపల్లి ఎంపీ బొర్లకుంట వెంకటేష్ నేత, ఎమ్మెల్సీ దండె విఠల్ ఉన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ ప్రెసిడెంట్ కలగూర రాజ్‌కుమార్, జడ్పీటీసీ తిరుమల, సర్పంచ్ గద్దె రాంరెడ్డి, మండల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు పోడేటి రవి, నల్లాల రాజలింగు, ఎక్స్ జెడ్పీటీసీ జర్పుల రాజ్‌కుమార్ నాయక్, ఎక్స్ ఎంపీటీసీ రాము, చెన్నూర్ మార్కెట్ డైరెక్టర్ రాజ్‌కుమార్ నాయక్, నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, మండల నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

వరలక్ష్మికి పరంజ్యోతి పురస్కారం

నవతెలంగాణ-ముధోల్

తొమ్మిది వందలకు పైగా చిమ్నీలు రాసిన రాజోలి వరలక్ష్మికి పరంజ్యోతి పురస్కారం ప్రధానం చేసినట్లు శ్రీ హంస వాహిని సాహిత్య కళా పీఠం ప్రధాన కార్యదర్శి పీసర శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. చిమ్నీలు రూపకర్త జాదవ్ పుండలిక్‌రావు పాటిల్ రూపొందించిన చిమ్నీలు ప్రక్రియ ద్వారా విశేషమైన తెలుగు సాహిత్య సేవ చేసినందుకు ఈ పురస్కారం ప్రధానం చేసినట్లు ఆయన తెలిపారు. రాజోలి వరలక్ష్మికి చిమ్నీలు, న్యాయ నిర్ణేత జాగిరి యాదగిరి, సమీక్షకులు బసవ రాజు, గౌరీ సరిత, పసుల శంకర్ అభినందించారు.

బీజేపీ నాయకుల సహపంక్తి భోజనం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఎమ్మెల్యే సహపంక్తి భోజనంలో భాగంగా శనివారం బీజేపీ నాయకులు కాగజ్‌నగర్‌లో సహపంక్తి భోజనం చేశారు. దీనికి ముఖ్య అతిథిగా మహారాష్ట్ర చిమూర్ ఎమ్మెల్యే బంటిభావు భాంగ్డియా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు, పట్టణ అధ్యక్షులు సిందం శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు ఈర్ల విశ్వేశ్వర్‌రావు, దెబ్బటి శ్రీనివాస్, నాయకులు శ్రీరాంగౌడ్, కొంగ సత్యనారాయణ, ధోని శ్రీశైలం పాల్గొన్నారు.

కాంగ్రెస్ టికెట్ కోసం సొతుకు సుదర్శన్ దరఖాస్తు



నవతెలంగాణ-మందమర్రి

చెన్నూర్ నియోజవర్గ ఎమ్మెల్యేకు పోటీ చేసేందుకు కాంగ్రెస్ టికెట్ కోసం సొతుకు సుదర్శన్ గాంధీభవన్‌లో శనివారం దరఖాస్తు చేసుకున్నారు. శుక్రవారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిసి వర్కింగ్ ప్రెసిడెంట్ ముఖేష్ కుమార్‌గౌడ్‌కు దరఖాస్తును అందజేశారు. 1983 నుంచి తాను కాంగ్రెస్‌కు అందించిన సేవలను దరఖాస్తులో పేర్కొన్నారు. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్, కాంగ్రెస్ మండల ప్రెసిడెంట్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎస్సీ సెల్ వైస్ ఛైర్మన్, జనరల్ సెక్రెటరీగా నిత్యం ప్రజల్లో ఉండి సేవా కార్యక్రమాలు ఎన్నో చేశానని మందమర్రి పట్టణానికి చెందిన సుదర్శన్ తెలిపారు.

డిగ్రీ కళాశాలలో హరితహారం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో 50 మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ లక్ష్మీనరసింహం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి తూడూరు దత్తాత్రేయ, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



విద్యార్థులకు సామాజిక మాధ్యమాలపట్ల జాగ్రత్తగా వ్యవహరించాలనీ, సైబర్ క్రైమ్‌పై అవగాహన కలిగి ఉండాలని పట్టణ ఎస్సై బి.అశోక్ అన్నారు. పట్టణ పరిధిలోని స్థానిక గ్రీన్ వుడ్ పాఠశాలలో సైబర్ క్రైమ్స్, ఉమెన్ సేఫ్టీ, షీ టీమ్ ఈవ్ టీసింగ్, డయాల్ 100, హక్ ఐ యాప్‌లపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అశోక్ మాట్లాడుతూ విద్యార్థులు సెల్ ఫోన్ ను జాగ్రత్తగా వాడాలని మంచి చెడులు రెండూ ఉంటాయనీ మంచిని మాత్రమే తీసుకోవాలన్నారు. అపరిచిత వ్యక్తులతో చాటింగ్ ప్రమాదాలకు దారితీస్తుందని, డబ్బులు పంపిస్తాం ఓటీపీ చెప్పండనీ రకరకాల మెసేజ్లు వస్తాయని తొందరపడి ఓకే చెప్పవద్దని అన్నారు.

కేజీబీవీలో సిట్టింగ్ జడ్జి విచారణ

నవతెలంగాణ-తాండూర్

తాండూర్ కస్తూర్బా బాలికల గురుకులంలో శనివారం బెల్లంపల్లి సివిల్ జడ్జి జె.ముఖేష్ విచారణ చేపట్టారు. బోధనేతర సిబ్బంది ఎస్ఓ కవితాపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో జడ్జి విచారణ చేపట్టారు. వంట గదులను వంట సామాగ్రిని తాగునీటిని పడకగదులను పరిశీలించారు. గురుకులంలోని వసతులను రోజువారి ఆహార విషయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.